

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే చర్యలు: డీఎంహెచ్‌వో

బాపట్ల, న్యూస్‌టుడే: స్కానింగ్ కేంద్రాల్లో లింగ నిర్ధారణ పరీక్షలు చేయరాదని డీఎంహెచ్‌వో విజయమ్మ అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన జిల్లాస్థాయి సలహా మండలి సమావేశంలో ఆమె మాట్లాడారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే స్కానింగ్ కేంద్రాల లైసెన్స్ రద్దు చేయటంతో పాటు నిర్వాహకులపై కేసు నమోదు చేయిస్తామని హెచ్చరించారు. అర్హత కలిగిన వైద్యుల సమక్షంలోనే స్కానింగ్ తీయాలని స్పష్టం చేశారు. డీఐవో వెంకటేశ్వర్లు, డీపీఎం రోహిణి రత్నశ్రీ, వైద్యాధికారులు సౌజన్య, శాంతి వైష్ణవి, శ్రీకాంత్, మహమ్మద్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

దసరా శోభ


మేదరమెట్లలో గాయత్రీదేవిగా అమ్మవారు

దసరా నవరాత్రి మహోత్సవాలతో జిల్లాలో సందడి వాతావరణం నెలకొంది. ఆలయాల్లో అమ్మవారికి వేకువజామున అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేశారు. శుక్రవారం కావడంతో అమ్మవారి దర్శనానికి భక్తులు బారులుదీరారు. ఈ సందర్భంగా గుడుల్లో కుంకుమ పూజలు, చండీ హోమం నిర్వహించారు. - చీరాల అర్బన్, మేదరమెట్ల, న్యూస్‌టుడే


చీరాలలో మహాలక్ష్మమ్మ చెట్టు వద్ద..

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం: మంత్రి గొట్టిపాటి

✦ కారంచేడులో రూ.75 లక్షలతో శుద్ధజల పథకం ప్రారంభం

✦ రూ.కోటి నగదు చెక్కు అందజేసిన దగ్గుబాటి కుటుంబ సభ్యులు


నీటి పథకాన్ని ప్రారంభిస్తున్న మంత్రి గొట్టిపాటి, ఎంపీ పురందేశ్వరి, ఎమ్మెల్యే ఏలూరి, కలెక్టర్ మురళి, మాజీ మంత్రి దగ్గుబాటి, హితేశ్

కారంచేడు (మార్టూరు), న్యూస్‌టుడే: ప్రజల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పాలన సాగిస్తోందని, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజారోగ్య సంరక్షణకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి నిధులు కేటాయించి శుద్ధజల పథకాలు నెలకొల్పడం అభినందనీయమని మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. కారంచేడులో శుక్రవారం శుద్ధజల పథకం ప్రారంభం, మరో శుద్ధజల పథకం భూమి పూజా కార్యక్రమాల్లో మంత్రితో పాటు ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, ఆమె కుటుంబసభ్యులు దగ్గుబాటి వెంకటేశ్వరరావు, హితేశ్ చెంచురామ్ పాల్గొన్నారు. తొలుత ఓఎన్‌జీసీ, రామ్‌కీ గ్రూప్ సంస్థల సహకారంతో ఏర్పాటు చేసిన కమ్యూనిటీ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ని ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో పురందేశ్వరి మాట్లాడుతూ ప్రజలు, ప్రజాప్రతినిధులు, సేవా సంస్థల తోడ్పాటుతో అభివృద్ధి, సేవా కార్యక్రమాలను శక్తిమేర సాగిస్తున్నామన్నారు. స్వగ్రామం కారంచేడు వాసుల వాడుక, తాగునీటి అవసరాలు పూర్తి స్థాయిలో తీర్చేందుకు ఈ పథకాలు అండగా నిలుస్తాయని చెప్పారు. ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు మాట్లాడుతూ కారంచేడులో నూరు శాతం సీసీ రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణాలు పూర్తి చేసేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు వెళ్తున్నామన్నారు. హైవే విస్తరణ పనులతో అవస్థలు పడుతున్న పర్చూరు, కారంచేడు ప్రాంత రైతుల ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే దిశగా పనిచేస్తామన్నారు. గ్రామంలో విద్యుత్తు ఇబ్బందులు, సమస్యలు తొలగించాలని మంత్రి దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన ఆయన గ్రామాల్లో పరిష్కరించేలా శాఖాపరమైన చర్యలకు ఆమోదం తెలిపారు. కలెక్టర్ వెంకట మురళి మాట్లాడుతూ జన్మస్థలం, కన్నతల్లిని మరువకుండా మన వంతు సేవ, సహాయం అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఊరి ప్రజల సంక్షేమాన్ని కోరుతూ భారీ నిధులతో దగ్గుబాటి కుటుంబం శుద్ధజల పథకాన్ని ఏర్పాటు చేయడం శుభపరిణామంగా అభివర్ణించారు. గ్రామస్థులకు శుద్ధజలాలు అందించాలనే సంకల్పంతో ఏర్పాటు చేయనున్న మరో పథకానికి హితేశ్ చెంచురామ్ రూ.కోటి నగదు చెక్కును అందజేయడంతో మంత్రి గొట్టిపాటితో పాటు అధికారులు, గ్రామస్థులు అభినందించారు.

చీరాల ఆర్డీవోగా అఖిల



చీరాల అర్బన్: చీరాల ఆర్డీవోగా దేవరకొండ అఖిల శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె వైజాగ్ నేషనల్ హైవే స్పెషల్ డిప్యూటీ కలెక్టరుగా పనిచేస్తూ ఇక్కడకు బదిలీపై వచ్చారు. నిన్నటి వరకు ఇక్కడ పనిచేసిన జి.సూర్యనారాయణరెడ్డిని జీడీఏలో రిపోర్టు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది.


డ్వామా పీడీగా విజయలక్ష్మి బాధ్యతల స్వీకరణ


విజయలక్ష్మికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న సిబ్బంది

బాపట్ల, న్యూస్‌టుడే: ఉపాధి హామీ పథకం అమలులో జిల్లాను అగ్రస్థానంలో నిలిపి పేద కూలీలకు ఉపాధి కల్పిస్తానని డ్వామా పీడీ విజయలక్ష్మి అన్నారు. ఏలూరు నుంచి ఆమె బదిలీపై బాపట్ల వచ్చారు. కలెక్టరేట్ ఆవరణలోని డ్వామా కార్యాలయంలో విజయలక్ష్మి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. కలెక్టర్ వెంకటమురళి, జేసీ ప్రఖర్‌జైన్‌ను ఆమె మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు.

నాటి నిర్లక్ష్యానికి సజీవ సాక్ష్యాలు

నాగార్జునసాగర్ కుడి కాలువ పరిధిలో ఐదేళ్ల వైకాపా పాలనలో కనీస నిర్వహణ, మరమ్మతు చేయకపోవడంతో కాలువలు అత్యంత అధ్వానంగా తయారయ్యాయి. ప్రస్తుతం సాగర్ జలాశయంలో పుష్కలంగా నీటి లభ్యత ఉండటంతో కాలువల సామర్థ్యం మేరకు నీటిని విడుదల చేస్తున్నా ఆయకట్టు చివరి భూములకు సాగునీరు అందని పరిస్థితి. కాలువలు పూర్తిగా పిచ్చిమొక్కలతో నిండిపోయి నీటి ప్రవాహం ముందుకు సాగని దుస్థితి. పిచ్చిమొక్కలు పెరగడంతో కాలువ గట్ల వెంబడి రైతులు కూడా వెళ్లడానికి అడ్డంకులు ఏర్పడుతున్నాయి.


ఆకురాజుపల్లి మేజరు కాలువను మూసేసిన కంప చెట్లు

ఈనాడు, బాపట్ల

గతేడాది సాగర్ కాలువల కింద పంటలకు సాగునీరు విడుదల చేయకపోవడంతో మరింత అధ్వానంగా మారాయి. వైకాపా ఐదేళ్ల పాలనలో చేసిన నిర్లక్ష్యం ఇప్పుడు సాగుదారులకు శాపంగా మారింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చేటప్పటికే జూన్ నెల తొలి వారం రావడంతో అప్పటికే వర్షాలు మొదలయ్యాయి. కాలువల మరమ్మతుకు ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి పంపేటప్పటికే జులై నెల దాటిపోయింది. కృష్ణానదిపై జలాశయాలు నిండటంతో కాలువలకు నీటివిడుదల మొదలైంది. ఈ నేపథ్యంలో పనులు చేపట్టడానికి అడ్డంకులు ఏర్పడ్డాయి. ప్రభుత్వానికి పంపిన ప్రతిపాదనలకు ఆమోదం రావాల్సి ఉంది. ప్రభుత్వం నుంచి నిధులు వచ్చి పనులు చేయడానికి సమయం పడుతున్నందున రైతులే కమిటీలుగా ఏర్పడి పనులు చేయడానికి సిద్ధమయ్యారు.

3253 కిలోమీటర్ల పొడవున కాలువలు

ఉమ్మడి గుంటూరు జిల్లాలో సాగర్ కుడి కాలువ కింద ప్రధాన కాలువ, బ్రాంచ్ కాలువలు, డిస్ట్రిబ్యూటరీలు, డబ్ల్యూఏలు కలిపి 3253.953 కిలోమీటర్ల పొడవున విస్తరించి ఉన్నాయి.

విభాగం	దూరం (కి.మీ.)
ప్రధాన కాలువ	137.443
బ్రాంచ్ కాలువలు	173.370
డిస్ట్రిబ్యూటరీలు	891.658
డబ్ల్యూఏలు	2051.482
మొత్తం	3253.953

306 పనులు.. రూ.26 కోట్లు: సాగర్ కుడికాలువ పరిధిలో గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో కాలువల మరమ్మతుకు 306 పనులతో రూ.26 కోట్లకు జలవనరులశాఖ ప్రతిపాదనలు పంపింది. ప్రభుత్వం నుంచి ఆమోదం లభిస్తే వెంటనే పనులు చేపట్టనున్నారు. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేస్తూ అనుమతులు రావాల్సి ఉంది. మరోవైపు ఇప్పటికే పంటల సాగు మొదలైనందున నీటి ప్రవాహానికి అడ్డంకులు తొలగించడానికి రైతులు కొందరు జేసీబీలు పెట్టి అక్కడక్కడ పనులు చేసుకుంటున్నారు. నరసరావుపేట ఎమ్మెల్యే అరవిందబాబు మూడు జేసీబీలు పెట్టి కాలువల్లో నీటిప్రవాహానికి అడ్డంకులు ఎక్కడైనా ఉన్నట్లయితే జేసీబీల సాయంతో పని చేసుకునేలా రైతులకు వెసులుబాటు కల్పించారు. గురజాల నియోజకవర్గంలో ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు రైతులతో సమావేశం నిర్వహించి ఆయా కాలువల పరిధిలో కమిటీలు వేసి వాటి ఆధ్వర్యంలో జేసీబీలతో కాలువలు బాగు చేయాలని నిర్ణయించారు. ప్రభుత్వం నిధులు విడుదల చేసే వరకు వేచిచూడకుండా నియోజకవర్గంలో కాలువలు బాగు చేయడానికి ప్రణాళిక రూపొందించారు. ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటకు సాగు నీరు సకాలంలో అందించడానికి చర్యలు చేపట్టారు.


ఇది సాగునీటి కాలువే..

కుడి కాలువకు 10675 క్యూసెక్కులు

సాగర్ కుడికాలువ కింద నీటి అవసరాలు పెరగడంతో 10675 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. కుడి కాలువ హెడ్ రెగ్యులేటర్ నుంచి 3757 క్యూసెక్కులు, విద్యుత్తు ఉత్పత్తి ద్వారా 6918 క్యూసెక్కుల నీటిని కాలువకు వదులుతున్నారు. సాగర్ జలాశయంలో గరిష్ఠ నీటిమట్టం కొనసాగుతున్నందున కుడి కాలువకు పూర్తిస్థాయిలో నీటిని విడుదల చేస్తున్నారు. బ్రాంచ్ కాలువలకు వాటి సామర్థ్యం మేరకు నీటిని విడుదల చేస్తున్నా మేజరు, మైనరు కాలువలు అత్యంత అధ్వానంగా ఉండటంతో నీటివృథా ఎక్కువగా ఉండి చివరి భూములకు సాగునీరు అందడం లేదు. జలాశయంలో నీటిలభ్యత ఉన్నా పొలాలకు సాగునీరు అందని పరిస్థితి. ఎండలు ఎక్కువగా ఉండటంతో సాగు నీటి అవసరాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. భారీవర్షాల తర్వాత ఎండలకు పంటలు వడలిపోతున్నాయి. ఈ నేపథ్యంలో జలవనరులశాఖ ఇంజినీర్లు అప్రమత్తమై రైతులకు సాగునీరు సక్రమంగా అందేలా చూడాల్సి ఉంది.


నీటి ప్రవాహానికి అడ్డంగా ఇలా..

వరద బాధితులకు గ్రానైట్ యజమానుల వితరణ

రూ.15 లక్షల చెక్కు ఎమ్మెల్యే ఏలూరికి అందజేత


ఎమ్మెల్యే ఏలూరికి నగదు చెక్కును అందజేస్తున్న మార్టూరు ప్రాంత గ్రానైట్ యజమానులు

మార్టూరు, న్యూస్‌టుడే: వరద బాధితులకు సహాయార్థంగా మార్టూరు ప్రాంత గ్రానైట్ యజమానులు పలువురు చేయూతనందించారు. బాధితులను ఆదుకోవాలనే సంకల్పంతో కొందరు తమ సొంత నిధులను వితరణగా చాటారు. అందులో భాగంగా వసూలైన రూ.15 లక్షలను ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుకు శుక్రవారం మండలంలోని ఇసుకదర్శి క్యాంపు కార్యాలయంలో అందజేశారు. గ్రానైట్ యజమానులు పత్తిపాటి సురేశ్, ఇంటూరి ఆంజనేయులు, చెరుకూరి అంజిబాబు, సుబ్బరామయ్య, రజాక్, తేలప్రోలు శ్రీనివాసరావు తదితరులు ఎమ్మెల్యే ఏలూరిని కలిసి తమవంతు సహాయాన్ని బాధితులకు అందేలా చొరవ చూపాలని కోరారు. వీరందరినీ ఏలూరి అభినందించారు.

జ్వరంతో మంచమెక్కిన పల్లెలు


తాత కృష్ణారావుతో బూర్ల జ్యోతి

పెదగంజాం (చినగంజాం), న్యూస్‌టుడే: పెదగంజాం పంచాయతీ పరిధిలోని ఆవులదొడ్డికొత్త గొల్లపాలెం, ఆవులదొడ్డి పాతగొల్లపాలెం శివారు గ్రామాల ప్రజలు జ్వరాలతో బాధపడుతున్నారు. కొత్తగొల్లపాలెంలో 1,200 మంది జనాభా ఉండగా, పాతగొల్లపాలెంలో 400 మంది నివసిస్తున్నారు. ఈ రెండు గ్రామాల్లోనూ ప్రతి ఇంటిలో ఒకరు వంతున చిన్న, పెద్ద, వృద్ధ అనే తేడా లేకుండా బాధితులు ఉన్నారు. ఒకే కుటుంబంలోని వారందరికి జ్వరాలు వచ్చి, వాటిని నయం చేయించుకోవడానికి అవసరమైన డబ్బులు కోసం నానా యాతనాలు పడుతున్నారు. అప్పులు చేసి ఒంగోలు పట్టణంలోని ప్రైవేటు ఆసుపత్రిల్లో చికిత్స పొందుతున్నారు. కొత్తగొల్లపాలెం గ్రామానికి చెందిన వడ్లమూడి శ్రీను, భార్య నాగచైతన్య జ్వరంతో శుక్రవారం ఒంగోలులోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చేరారు. గడ్డం కవిత తన నెలల వయసున్న చంటి బిడ్డ, తల్లితో కలిసి ఆటోలో ఒంగోలు వచ్చి, చికిత్స పొందుతున్నారు. ఇదే గ్రామానికి చెందిన వడ్లమూడి కృష్ణారావు కుమార్తె తొమ్మిదేళ్ల బూర్ల జ్యోతికి ఇప్పటికి రెండుసార్లు జ్వరం వచ్చింది. కొద్ది రోజుల క్రితం వచ్చినప్పుడు తన మనుమరాలు జ్యోతికి రూ.15వేలు వ్యయం చేసి నయం చేసుకున్నామని తాత కృష్ణారావు ఆవేదన వ్యక్తం చేశారు. మళ్లీ రెండోసారి జ్వరం రావడంతో ఒంగోలు తీసుకువచ్చి చికిత్స చేయిస్తున్నట్లు తెలిపారు. రెండు గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటుచేయాలని ప్రజలు కోరుతున్నారు. తాగునీరు, పారిశుద్ధ్య పరిస్థితులను అధికారులు పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తిచేస్తున్నారు.


తన తల్లి, చంటి బిడ్డతో వైద్యశాలకు వచ్చిన గడ్డం కవిత

స్టాఫ్ నర్సులకు పదోన్నతి

గుంటూరు వైద్యం: వైద్య ఆరోగ్య శాఖలో స్టాఫ్ నర్సులుగా పని చేస్తున్న వారిలో అర్హులైన వారికి హెడ్ నర్సులుగా పదోన్నతిస్తూ ప్రాంతీయ వైద్య ఆరోగ్య సంచాలకులు సుచిత్ర శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. వీరిలో ఆరుగురిని గుంటూరు జీజీహెచ్, ఇద్దరికి ఒంగోలు, మరొకరికి నెల్లూరు కేటాయించారు. గత జూన్ నుంచి వీరు పదోన్నతుల కోసం ఎదురుచూస్తున్నారు. ఎట్టకేలకు మూడు నెలల తర్వాత వారికి ఉద్యోగోన్నతి దక్కింది.

బాపట్ల - రేపల్లె రైల్వేలైన్ నిర్మించండి

❖ తెనాలి - రేపల్లె రైల్వే మార్గాన్ని డబ్లింగ్ చేయాలని వినతి

❖ ద.మ. రైల్వే జీఎంకు ప్రతిపాదనలు అందజేసిన ఎంపీ కృష్ణప్రసాద్


సమావేశంలో పాల్గొన్న బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్

బాపట్ల: బాపట్ల-నిజాంపట్నం-రేపల్లె మధ్య నూతన రైల్వే మార్గాన్ని నిర్మించాలని దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్‌ను బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ కోరారు. విజయవాడలో ఎంపీలతో నిర్వహించిన సమావేశంలో బాపట్ల లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో చేపట్టాల్సిన రైల్వే ప్రాజెక్టులు, స్టేషన్ల అభివృద్ధి, సూపర్ ఫాస్ట్ రైళ్లకు స్టాపింగ్ కల్పించాలని కోరుతూ ప్రతిపాదనలను జీఎంకు అందజేశారు. ప్రతిపాదిత మచిలీపట్నం-రేపల్లె కొత్త రైల్వే మార్గాన్ని బాపట్ల వరకు పొడిగించాలన్నారు. తెనాలి-రేపల్లె రైల్వే మార్గాన్ని డబ్లింగ్ చేయాలని, విజయవాడ-గూడూరు మధ్య నాలుగో లైన్ నిర్మించాలి, కొత్త ఎక్స్‌ప్రెస్ రైళ్లు ప్రవేశపెట్టాలని ప్రతిపాదించారు. వివరాలు ఆయన మాట్లల్లోనే..

❖ విజయవాడ-బెంగళూరు మధ్య వయా బాపట్ల, ఒంగోలు, నెల్లూరు, తిరుపతి మీదగా కొత్తగా వందేభారత్ సూపర్‌ఫాస్ట్ రైలు ప్రవేశపెట్టాలి. రైళ్లలో స్లీపర్ కోచ్ బోగీలు ఎక్కువగా ఉండాలి. బాపట్ల లోక్‌సభ నియోజకవర్గానికి చెందిన వేల మంది సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు బెంగుళూరులో పని చేస్తున్నారు. వారికి ఈ రైలు ఎంతో ఉపయోగం. రద్దీగా ఉన్న విజయవాడ-గూడూరు మధ్య నాలుగు రైల్వే లైన్ నిర్మించాలి.

❖ విజయవాడ-బాపట్ల-చీరాల మధ్య కొత్తగా ఇంటర్ సిటీ రైలు నడపాలి. బాపట్ల-చీరాలలో ప్రముఖ పర్యాటక కేంద్రాలకు రాజధాని అమరావతి ప్రాంతం నుంచి పర్యాటకులు రాకపోకలు సాగిస్తారు. భవిష్యత్తు అవసరాల దృష్ట్యా ఈ రైలు కీలకం. ఆక్వా, వ్యవసాయ, చేనేత ఉత్పత్తుల రవాణాకు మంచి అవకాశాలు ఉన్నాయి. బాపట్ల-చీరాల భవిష్యత్తులో జంట పట్టణాలుగా, హటీ హబ్‌గా ఎదుగుతాయి.

❖ జిల్లా, లోక్‌సభ నియోజకవర్గ కేంద్రమైన బాపట్లలో వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌కు స్టాపింగ్ ఇవ్వాలి. ప్రస్తుతం విజయవాడ-నెల్లూరు మార్గంలో నడుస్తున్న రెండు వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌ల (సికింద్రాబాద్-తిరుపతి, విజయవాడ-చెన్నై)లలో ఒక దాన్ని బాపట్ల, మరొకటి వాణిజ్య పట్టణమైన చీరాలలో ఆపాలి. ఈ రైళ్లకు స్టాపింగ్ కోసం ప్రజల నుంచి డిమాండ్ ఎక్కువగా ఉంది. అదనంగా కోచ్‌లు పెంచాలి.

❖ అరవై శాతం ఆర్వోబీ, ఆర్‌యూబీల నిర్మాణానికి బడ్జెట్ కేటాయింపులు ఉన్నా ఇంత వరకు నిర్మాణ పనులు చేపట్టలేదు. రైలుగేటు పడిన ప్రతిసారి 20 నుంచి 40 నిమిషాలు వాహనాల రాకపోకలు ఆగిపోయి వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. పెండింగ్ ప్రాజెక్టులు తక్షణమే ప్రారంభించి పూర్తి చేయటానికి చర్యలు తీసుకోవాలి. కొత్తగా ఆర్వోబీలు, ఆర్‌యూబీల నిర్మాణంపై సర్వే పూర్తి చేసి నిధులు, అనుమతులు ఇవ్వాలి.

❖ బాపట్ల-నిజాంపట్నం-రేపల్లె మధ్య నూతన రైల్వే మార్గాన్ని నిర్మించాలి. ఈ రైల్వేలైన్ నిర్మాణంపై గతంలో సర్వే చేశారు. దీనిని ప్రతిపాదిత మచిలీపట్నం-రేపల్లె రైల్వే మార్గంతో అనుసంధానం చేయాలి.

❖ బాపట్ల, చీరాల రైల్వేస్టేషన్ల ఆధునికీకరణ, అభివృద్ధికి నిధులు కేటాయించాలి. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి. రెండు స్టేషన్లలో కాలినడక వంతెనలు నిర్మించాలి. వేమూరు, రేపల్లె, వేటపాలెం, చినగంజాం, అప్పికట్ల, స్టూవర్టుపురం రైల్వేస్టేషన్లలో మౌలిక వసతులు మెరుగుపరచాలి. బిట్రగుంట- విజయవాడ, గూడూరు-విజయవాడ ప్యాసింజర్ రైళ్లు ఆపాలి. సికింద్రాబాద్-రేపల్లె ఎక్స్‌ప్రెస్ రైలును వేమూరు స్టేషన్లో ఆపాలి

❖ కొవిడ్-19 మహమ్మారికి ముందు బాపట్ల రైల్వే స్టేషన్లో చెన్నై-దిల్లీ మధ్య నడిచే జీటీ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌ను ఆపేవారు. కొవిడ్ సమయంలో రైలుకు స్టాపింగ్ ఎత్తేశారు. నాలుగేళ్లవుతున్నా తిరిగి పునరుద్ధరించలేదు. సూర్యలంకలో కీలకమైన వాయుసేనా కేంద్రం ఉంది. లోక్‌సభ నియోజకవర్గ కేంద్రమైన బాపట్ల నుంచి దేశ రాజధాని దిల్లీ వెళ్లటానికి రైలు సౌకర్యం లేదు. వెంటనే జీటీ ఎక్స్‌ప్రెస్‌కు స్టాపింగ్ పునరుద్ధరించాలి. బాపట్లలో జనశతాబ్ది, పద్మావతి, సంఘమిత్ర, గంగా కావేరి, కోరమండల్, రామేశ్వరం, చార్మినార్, దురంతో, విశాఖ-తిరుపతి డబుల్ డక్కర్, అమృత్ భారత్, శతాబ్ది సేతు ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆపాలి. చీరాల రైల్వేస్టేషన్లో సంఘమిత్ర, వందేభారత్, కోరమండల్ ఎక్స్‌ప్రెస్‌లకు స్టాపింగ్ ఇవ్వాలి.

ప్రకృతి వ్యవసాయంతో ఆదాయం మెరుగు

గుంటూరు: ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడం ద్వారా రైతుల ఆదాయాన్ని మెరుగుపర్చేందుకు శాస్త్రవేత్తలు, అధికారులు కృషి చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ అన్నారు. గుంటూరుకు సమీపంలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం లాంఫాం ఆడిటోరియంలో ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ ఆర్.శారద జయలక్ష్మీదేవి అధ్యక్షతన ప్రకృతి వ్యవసాయంపై శుక్రవారం కార్యశాల జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన రాజశేఖర్ మాట్లాడుతూ వ్యవసాయంలో చోటు చేసుకుంటున్న మార్పులు, రైతులు ఎదుర్కొంటున్న సంక్షోభం, ఆత్మహత్యలు వంటి సామాజిక సమస్యలను పరిష్కరించడానికి పునఃసమీక్షించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. అవసరానికి మించి రసాయనాలు ఉపయోగించడంతో వాతావరణంలో మార్పులు వచ్చాయని ఆందోళన వ్యక్తం చేశారు. వాటి ప్రభావం వల్లే కేరళతో పాటు రాష్ట్రంలోని విజయవాడలో వరదలని పేర్కొన్నారు.

50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం

బాపట్ల: ఖరీఫ్ సీజన్లో జిల్లాలో 2.17 లక్షల ఎకరాల్లో వరి సాగు చేసినట్లు కలెక్టర్ వెంకట మురళి తెలిపారు. ధాన్యం సేకరణపై కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి శుక్రవారం రాత్రి వీక్షణ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ధాన్యం సేకరించటానికి అధికారులు సంసిద్ధం కావాలన్నారు. ఈ ఏడాది సగటున 5.64 లక్షల టన్నుల ధాన్యం దిగుబడులు వస్తాయని అంచనా వేశామన్నారు. జిల్లాలో 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా నిర్దేశించినట్లు పేర్కొన్నారు. గతేడాది 29 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామన్నారు. రైతుల నుంచి కనీస మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేస్తామన్నారు. ధాన్యం సేకరణకు తేమ యంత్రాలు, బరువు తూచే యంత్రాలు సిద్ధం చేసుకోవాలన్నారు. ఎనిమిది లక్షల గోనె సంచులు సిద్ధం చేసుకోవాలని చెప్పారు. టార్పాలిన్ పట్టాలు ముందుగానే రైస్‌మిల్లుల వద్ద ఉంచాలని సూచించారు. తుపాను వచ్చినా రైతులకు నష్టం జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ధాన్యం నిల్వకు గోదాములు సిద్ధం చేయాలన్నారు. జేసీ ప్రఖర్ జైన్, డీఆర్వో సత్తిబాబు, డీఎస్‌వో విలియమ్స్, డీఎం చంద్రశేఖర్ పాల్గొన్నారు.



సమావేశంలో కలెక్టర్ వెంకట మురళి

వంద మద్యం సీసాలు స్వాధీనం

వేటపాలెం, న్యూస్‌టుడే: అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారనే సమాచారంతో ఎస్సై మీసాల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పోలీసులు శుక్రవారం కొణిజేటి చేనేతపురి కాలనీకి చెందిన బొడ్డు వెంకటేశ్వర్లు ఇంటిపై దాడిచేశారు. ఈ సందర్భంగా నిల్వ చేసిన 100 క్వార్టర్ సీసాలను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

తండ్రి కల.. తనయుడు నెరవేర్చాడిలా..

- పవర్ లిఫ్టింగ్‌లో రాణిస్తున్న చీరాల యువకుడు ఖాజావలి
- కామన్వెల్త్ పోటీలకు అర్హత

ఆ యువకుడు.. తండ్రి కోరిక మేరకు బరువులు ఎత్తడం ప్రారంభించారు. ఎనిమిదేళ్లుగా ప్రతిభ చూపుతూ ఎన్నో పతకాలు, ప్రశంసపత్రాలు కైవసం చేసుకున్నారు. ఇటీవల కామన్వెల్త్ ఛాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికయ్యారు. సీనియర్ వరల్డ్ గేమ్స్‌లో రాణించాలనేది తన లక్ష్యంగా చెబుతున్నారు.. అతడే పవర్ లిఫ్టర్ ఖాజావలి.

చీరాల అర్బన్, న్యూస్‌టుడే



ఐపీఎఫ్ పోటీల్లో...

ఖాజావలిది చీరాల మండలం బోయినవారిపాలెం. తండ్రి సయ్యద్ బాషా విశ్రాంత ఆర్మీ ఉద్యోగి. తల్లి కరీమున్నీసా గృహిణి. బాషాకి చిన్నతనంలో బరువులు ఎత్తడం అంటే మక్కువ. ఆసక్తి ఉన్నా శిక్షణ పొందడానికి అవకాశం అనుకూలించలేదు. ఇంతలో సైన్యంలో ఉద్యోగం వచ్చింది.. తన మనసులో కోరిక అలాగే ఉండిపోయింది. ఈక్రమంలో కుమారుడ్ని పవర్ లిఫ్టర్‌గా చూడాలనుకున్నారు. ఖాజావలి ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతుండగా చీరాల రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో జిల్లా స్పోర్ట్స్ విభాగం ఏర్పాటు చేసిన శిక్షణలో మెలకువల కోసం చేర్పించారు. ఆనాటి నుంచి ఖాజావలి వెనుతిరిగి చూడకుండా పోటీల్లో పాల్గొన్న ప్రతిసారి బహుమతులు కైవసం చేసుకున్నారు. జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ సహకారంతో మరింత ప్రావీణ్యం సంపాదించారు. తొలుత 250 కిలోల బరువు ఎత్తడం ప్రారంభించి ఇప్పుడు జూనియర్ విభాగంలో 810 కిలోల వరకు ఎత్తి విజయాన్ని సొంతం చేసుకున్నారు.



ప్రశంసపత్రాలతో ఖాజావలి, తండ్రి బాషా

ఉత్తమ లిఫ్టర్‌గా రెండుసార్లు

రాష్ట్రస్థాయి పోటీలకు 15 సార్లు హాజరవ్వగా ప్రతిసారి పతకాలు సాధించారు. వీటిల్లో 12 బంగారు, 2 రజత, 3 కాంస్యం ఉన్నాయి. విశ్వవిద్యాలయం స్థాయిలో జరిగిన పవర్ లిఫ్టింగ్ పోటీల్లో మూడు పసిడి, రెండు రజత పతకాలు సాధించారు. సౌత్ ఇండియా పరిధిలో ఒక బంగారు, జాతీయ స్థాయిలో రెండు పసిడి, 4 సిల్వర్, ఒక కాంస్య పతకం కైవసం చేసుకున్నారు. ఉత్తమ లిఫ్టర్‌గా రాష్ట్రం నుంచి రెండు సార్లు ఎంపికయ్యారు.



సాధించిన పతకాలు

చెన్నైలో శిక్షణ

ప్రస్తుతం చెన్నైకు చెందిన శిక్షకుడు అరుణ్ బాలాజీ వద్ద ఖాజావలి శిక్షణ పొందుతున్నారు. అవకాశం దొరికినప్పుడల్లా రెండు నెలల పాటు అక్కడే ఉండి సాధన చేస్తున్నారు. ఇప్పటి వరకు అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్రస్థాయిలో పలు పతకాలు కైవసం చేసుకున్నారు. ప్రస్తుతం సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో ఎంబీఏ చదువుతున్నారు. ఆగస్టులో యూరప్‌లో నిర్వహించిన మాల్టా-2024 పోటీల్లో తృతీయ స్థానంతో కాంస్య పతకం సొంతం చేసుకుని, కామన్వెల్త్ ఛాంపియన్‌షిప్ పోటీలకు అర్హత సాధించారు.

లక్ష్యం సాధిస్తా: ఖాజావలి

ఎనిమిదేళ్లుగా పవర్ లిఫ్టింగ్ పోటీల్లో రాణిస్తున్నాను. ఇప్పుడు నా వయసు 22 సంవత్సరాలు.. జూనియర్ విభాగపు పోటీలకు మాత్రమే వెళుతున్నాను. 23 ఏళ్లు వస్తే సీనియర్ విభాగంలో పాల్గొనే అవకాశం కలుగుతుంది. సీనియర్ వరల్డ్ గేమ్స్‌కి వెళ్లి పతకాలు కైవసం చేసుకోవాలనేది లక్ష్యం. ఆ దిశగానే తర్ఫీదు పొందుతున్నాను. ప్రస్తుతం సాధన చేస్తున్న సమయానికి మరో నాలుగు గంటలు కృషి చేసి, అనుకున్న స్థాయికి చేరుతాను.

మనోవేదనతో ఉద్యోగం కోల్పోయా..

తాడేపల్లి, న్యూస్‌టుడే : గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం ఉండవల్లిలో శుక్రవారం నిర్వహించిన 'ప్రజాదర్బార్'లో మంత్రి నారా లోకేశ్‌కి రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి వచ్చిన ప్రజలు వినతిపత్రాలు అందజేశారు. విజయవాడ బస్‌స్టేషన్‌లో గతేడాది డ్రైవర్ నిర్లక్ష్యం వల్ల ప్లాట్ ఫాంపై ఉన్న ప్రయాణికులపైకి బస్సు దూసుకొచ్చిన ఘటనలో తన ఆరు నెలల కుమారుడు మృతి చెందాడని, ఆ మనోవేదనతో ఉద్యోగాన్ని కోల్పోయానని బాపట్ల జిల్లా జే పంగులూరుకు చెందిన కాటి యలమంద వినతిపత్రం అందజేశారు.

కలెక్టరేట్లో ఎంపీ ఫెలిసిటేషన్ కేంద్రం

బాపట్ల, న్యూస్‌టుడే: కలెక్టరేట్ ఆవరణలోని బావుడా కార్యాలయంలో ఖాళీగా ఉన్న ఛైర్మన్ ఛాంబర్‌ను స్థానిక ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ ఫెలిసిటేషన్ కార్యాలయానికి కేటాయించారు. ఎంపీ లాడ్స్ నిధులతో లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో చేపట్టనున్న ప్రగతి పనులపై ఈ కార్యాలయం ద్వారా ఎంపీ సిబ్బంది జిల్లా అధికారులతో సమన్వయం చేసుకుంటారు. బావుడాకు ప్రత్యామ్నాయంగా మరో కార్యాలయాన్ని అన్వేషించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు.

నేడు ఖేలో ఇండియా దక్షిణజోన్ రాష్ట్ర ఖోఖో జట్ల ఎంపిక

జే పంగులూరు, న్యూస్‌టుడే: ఖేలో ఇండియాలో పాల్గొనే జూనియర్, సబ్‌జూనియర్ దక్షిణ జోన్ ఖోఖో రాష్ట్ర క్రీడాకారిణుల జట్ల ఎంపిక శనివారం జే పంగులూరు ఎంఎస్ఆర్ అండ్ బీఎస్ఎం క్రీడామైదానంలో జరుగుతుందని ఖోఖో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎం.సీతారామిరెడ్డి తెలిపారు. తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూరులో ఈనెల 16, 17, 18 తేదీల్లో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఖోఖో పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పోటీల్లో పాల్గొనే అండర్-14, -17 విభాగాల క్రీడాకారిణులు శనివారం ఉదయం పది గంటలకు హాజరు కావాలని సూచించారు. రాష్ట్రంలోని 13 జిల్లాల నుంచి బాలికలు హాజరు కావాలన్నారు. అన్ని జిల్లాల నుంచి సుమారు 100మంది హాజరయ్యే అవకాశం ఉందని చెప్పారు. అండర్-14లో 15, అండర్-17లో 15మంది క్రీడాకారిణులను మాత్రమే ఎంపిక చేస్తారని జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.భాస్కరరావు, బి.కాశీవిశ్వనాథరెడ్డి తెలిపారు. ఎంపికైన క్రీడాకారిణులకు పది రోజుల పాటు శిక్షణ శిబిరాలు నిర్వహిస్తారన్నారు.



మాట్లాడుతున్న జేసీ ప్రఖర్ జైన్

పరిశ్రమల స్థాపనకు ప్రోత్సాహం: జేసీ

బాపట్ల, న్యూస్‌టుడే: జిల్లాలో కొత్త పరిశ్రమలు స్థాపించేలా ఔత్సాహికులను ప్రోత్సహిస్తామని జేసీ ప్రఖర్ జైన్ అన్నారు. పరిశ్రమలు, ఎగుమతుల జిల్లా స్థాయి ప్రోత్సాహక కమిటీ సమావేశాన్ని కలెక్టరేట్లో శుక్రవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి ఉపాధి హామీ పథకం కింద కొత్త పరిశ్రమలు ఏర్పాటు చేసే వారికి రాయితీలు, రుణాలు ఇస్తామన్నారు. రాయితీలు సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. పరిశ్రమల స్థాపనకు 96 దరఖాస్తులకు అనుమతులు మంజూరు చేశామని తెలిపారు. పీఎంఈజీపీ కింద 135 పరిశ్రమల ఏర్పాటు కోసం రూ.3.69 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. విశ్వకర్మ పథకం కింద చేతి వృత్తుల వారి నుంచి వచ్చిన 35,138 దరఖాస్తులు పరిశీలించి రుణాల మంజూరుకు ప్రభుత్వానికి నివేదించామన్నారు. జిల్లాలో 305 యూనిట్లకు రూ.7.09 కోట్ల రాయితీలు ఇవ్వనున్నట్లు తెలిపారు. జిల్లా పరిశ్రమల అధికారి రామకృష్ణ, ఎల్‌డీఎం శివకృష్ణ, అధికారులు పాల్గొన్నారు.

పంచాయతీల ప్రగతికి కృషి

బాపట్ల, న్యూస్‌టుడే: జిల్లాలో పంచాయతీల అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తానని డీపీవో కేఎల్ ప్రభాకరరావు అన్నారు. అనంతపురం నుంచి బదిలీపై వచ్చిన ఆయన డీపీవో కార్యాలయంలో శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కొత్త డీపీవోను డీఎల్‌పీవో శరత్‌బాబు, తూర్పు బాపట్ల పంచాయతీ కార్యదర్శి పల్నాటి శ్రీరాములు సత్కరించి పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టి అభివృద్ధి, సంక్షేమ పథకాలు నూరుశాతం అమలయ్యేలా కష్టపడి పని చేస్తానన్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుకు ప్రత్యేక దృష్టి సారిస్తానని చెప్పారు. కలెక్టర్ వెంకట మురళిని డీపీవో మర్యాదపూర్వకంగా కలిసి మొక్క అందజేశారు.



డీపీవో ప్రభాకరరావును సత్కరిస్తున్న డీఎల్‌పీవో శరత్‌బాబు, పంచాయతీ కార్యదర్శి శ్రీరాములు

భాజపాలో చేరిన నవతరం పార్టీ పార్లమెంటు అధ్యక్షుడు

కారంచేడు(మార్టూరు), న్యూస్‌టుడే: నవతరంపార్టీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షుడు నలమల తిరుపతిరావు భాజపా రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి సమక్షంలో ఆపార్టీ కండువా కప్పుకొన్నారు. శుక్రవారం కారంచేడులోని ఎంపీ పురందేశ్వరి ఇంటి వద్ద పలువురు కార్యకర్తలు, అభిమానులతో కలిసి భాజపాలో చేరారు. జిల్లాలో పార్టీ ఉన్నతికి శ్రమిస్తానని తిరుపతిరావు వెల్లడించారు. ఆయనతోపాటు మార్టూరు మండల నాయకులు చేబ్రోలు రామాంజనేయులు, అరవపల్లి నాగహరగోపాల్, ఉప్పలపాటి రామరాజు తదితరులు పాల్గొన్నారు.

నీటి కుంటలో పడి అన్నదమ్ముల మృతి

దసరా సెలవులకు నానమ్మ-తాతయ్య దగ్గరకు వచ్చిన చిన్నారులు ✦ ఐదేళ్ల క్రితమే తండ్రి కన్నుమూత.. తల్లితో కలిసి అమ్మమ్మ చెంతన నివాసం



కుంటలో పడి కన్నుమూసిన మణిశ్రీరెడ్డి, సిద్ధారెడ్డి

బూదవాడ(జే.పంగులూరు), న్యూస్‌టుడే: ఇద్దరు చిన్నారులు.. సరదాగా ఆడుకుంటున్నారు.. ఇంతలో అటుగా వచ్చిన కుక్కలను తరుముతూ వెంటపడ్డారు.. అదే వారి శాపమైంది. అలా వెంటపడుతూ వెళ్లి ఎనిమిది అడుగుల నీటి కుంటలో పడి మృత్యువాతకు గురయ్యారు.. సరదాగా దసరా సెలవులకని వచ్చి అనంతలోకాలకు వెళ్లిపోయారు.. ఈ హృదయవిదారక సంఘటన జే పంగులూరు మండలం బూదవాడలో శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. ఎస్సై బి.వినోద్‌కుమార్ అందించిన సమాచారం మేరకు.. మండలంలోని బూదవాడకు చెందిన కందుల భాస్కరరెడ్డి-వెంకటరమణకు ఇద్దరు సంతానం. ఐదేళ్ల క్రితం భాస్కరరెడ్డి మృతిచెందారు. నాటి నుంచి తల్లి వెంకటరమణతో కలిసి ఇద్దరు చిన్నారులు మణిశ్రీరెడ్డి, సిద్ధారెడ్డి బాపట్ల మండలం బేతపూడిలోని అమ్మమ్మ ఇంటి వద్ద నివసిస్తున్నారు. ఇద్దరూ ప్రాథమిక పాఠశాలలో అక్కడే చదువుకుంటున్నారు. ఈనేపథ్యంలో దసరా సెలవులు రావటంతో తాతయ్య కందుల అంజిరెడ్డి బేతపూడి వెళ్లి, అమ్మమ్మ ఇంటి వద్ద ఉన్న ఇద్దరు చిన్నారులను రెండురోజుల క్రితం బూదవాడ తీసుకొచ్చారు. శుక్రవారం సాయంత్రం ఇంటి వద్ద ఆడుకుంటూ అరుస్తున్న కుక్కలను చెదరగొడుతూ వాటి వెంటపడ్డారు. ఇంటి నుంచి కొంతదూరం వెళ్లిన తరువాత రహదారి పక్కనే గల నీటి కుంటలో తొలుత సిద్ధారెడ్డి(6) పడ్డాడు. అతన్ని బయటకు లాగే ఉద్దేశంతో సోదరుడు మణిశ్రీరెడ్డి(8) అందులోకి జారాడు. ఇద్దరు చిన్నారులు నీళ్లలో పడటాన్ని సమీపంలో గేదెలు కాస్తున్న వారు గమనించారు. హుటాహుటిన కుంట వద్దకు చేరుకుని బయటకు తీసేందుకు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. ఎనిమిది అడుగుల లోతు నీళ్లలో పడటంతో ఊపిరాడక మృతిచెందారు. కొద్దిసేపటి తరువాత కర్రతో నీళ్లలో ఇరుక్కున్న వారిని బయటకు తీసి, పరిశీలించగా మృతిచెందినట్లు నిర్ధారించుకున్నారు. అనంతరం మృతదేహాలను ఇంటికి తరలించారు. విషయం తెలుసుకున్న అద్దంకి రూరల్ సీఐ డి. మల్లికార్జునరావు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఇద్దరు మనుమలు మృత్యువాతకు గురికావటంపై తాతయ్య-నానమ్మ అంజిరెడ్డి, విజయలక్ష్మి కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. తల్లి వెంకటరమణకు సమాచారం అందించడంతో ఆమె రాగా విగతజీవులుగా పడి ఉన్న కుమారులను చూసి తీరని శోక సంద్రంలో మునిగిపోయింది. చూపరులను ఇది కలచివేసింది.

ఉరేసిన చున్నీ

బండిపై వెళుతుండగా మెడకు చుట్టుకుని మహిళ మృతి

ఏల్చూరు (సంతమాగులూరు), న్యూస్‌టుడే: మెడలో వేసుకున్న చున్నీ మృత్యుపాశమైంది. ఉరికొయ్యగా మారింది. ద్విచక్ర వాహనంపై వెళుతున్న మహిళ మెడకు చుట్టుకుని.. క్షణాల వ్యవధిలో భర్త, కుమారుడి కళ్లెదుటే ఆమె విగతజీవిగా మారింది. ఈ హృదయ విదారక సంఘటన నార్కట్‌పల్లి-అద్దంకి-మేదరమెట్ల ఎక్స్‌ప్రెస్(నామ్) రహదారిలో శుక్రవారం చోటుచేసుకుంది. ఎస్సై ఎం.పట్టాభిరామయ్య తెలిపిన వివరాల ప్రకారం... అద్దంకి మండలం మణికేశ్వరానికి చెందిన షేక్ కరీముల్లా, భార్య షాహీనా(36)లు తమ కుమారుడికి ఆరోగ్యం సరిగా లేకపోవడంతో ద్విచక్ర వాహనంపై నరసరావుపేట ఆసుపత్రికి వెళ్లారు. అక్కడ చూపించుకున్న అనంతరం తిరిగి ప్రస్తుతం తాము నివసిస్తున్న కొప్పెరపాడు గ్రామానికి బయలు దేరారు. నామ్ రహదారిలో ఏల్చూరు పెట్రోలు పంపు సమీపంలోకి రాగానే షాహీనా మెడలో ఉన్న చున్నీ ప్రమాదవశాత్తు ద్విచక్ర వాహన చక్రానికి చుట్టుకుపోయింది. ధాటికి ఆమె బండిపై నుంచి జారి, కింద పడింది. తలకు తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతిచెందింది. ఈసంఘటనతో తండ్రీకుమారుడు కన్నీరుమున్నీరయ్యారు. శోకసంద్రంలో మునిగిపోయారు. చూపరులను ఈ దృశ్యం కలచివేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



మృతిచెందిన మహిళ

వేటపాలెంలో మృతదేహంతో ఆందోళన



వేటపాలెం, న్యూస్‌టుడే: మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని మృతదేహంతో కులసంఘాలు, కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగిన ఘటన శుక్రవారం సాయంత్రం కొత్తకాలువ వద్ద చోటుచేసుకుంది. రెండు రోజుల క్రితం రామన్నపేట పంచాయతీ వినాయకపురానికి చెందిన గంటా శేఖర్(36) తన ఇంటిలో ఉరేసుకుని మృతిచెందిన విషయం తెలిసిందే. అతను ఆత్మహత్య చేసుకోవడానికి కుటుంబ కలహాలు కాదని, పక్కన నివసించే మహిళ వేధింపులతో ఇలా జరిగిందని మృతుడి కుటుంబ సభ్యులు, బహుజన ఐక్యవేదిక నాయకుల గంటా సుబ్బారావు ఆరోపించారు. మృతదేహానికి చీరాల ఏరియా వైద్యశాలలో పరీక్ష చేసి బంధువులకు అప్పగించారు. మృతదేహాన్ని ఇంటికి తీసుకొచ్చి, ఖననానికి ఏర్పాట్లు చేసుకుని తీసుకెళుతూ చీరాల-ఒంగోలు రహదారిపై ఉంచి, మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలని బైఠాయించి నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న ఎస్సై మీసాల వెంకటేశ్వర్లు ఘటనాస్థలానికి చేరుకుని నాయకులు, కుటుంబ సభ్యులతో మాట్లాడటంతో సమస్య సద్దుమణిగింది.

బ్రాయిలర్ ధరలు (కిలో ఒక్క రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 123, రిటైల్ ధర - 145, చికెన్ విత్‌స్కిన్ - 210, చికెన్ స్కిన్‌లెస్ - 239.

కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -120 రిటైల్ ధర 142 చికెన్ విత్ స్కిన్ - 206, చికెన్ స్కిన్‌లెస్ - 234.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 128, 138, 148 చికెన్ విత్ స్కిన్ - 240 చికెన్ స్కిన్‌లెస్ - 250.

నెక్ సూచించిన కోడిగ్రుడ్డు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 535 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.84/-.

బాపట్ల

•బాపట్ల •రేపల్లె •వేమూరు

విద్యుత్తు సరఫరాలో అంతరాయం

చుండూరు, న్యూస్‌టుడే: దసరా ఉత్సవాల నేపథ్యంలో ప్రజల ఏర్పాటుకు 11కేవీ లైన్ మార్పుల కోసం చుండూరు విద్యుత్తు ఉప కేంద్రం, మోదుకూరు ఫీడర్ పరిధిలోని గ్రామాలకు శనివారం ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ అర్జునరావు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

రేపల్లె అర్బన్ న్యూస్‌టుడే: విద్యుత్తు లైన్ల మరమ్మతుల దృష్ట్యా శనివారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అరవపల్లి, పెనుమూడి రోడ్డు, తూర్పు దళితవాడ, గూనిపాలెం ఏరియాల్లో సరఫరా ఉండదని ఏఈ శివనాగిరెడ్డి తెలిపారు.

తహసీల్దారుగా సుందరమ్మ

కర్లపాలెం: కర్లపాలెం తహసీల్దారుగా సుందరమ్మ శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఆమె నెల్లూరు జిల్లా కొండాపురం నుంచి సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడికి వచ్చారు. ఇక్కడ తహసీల్దారుగా పని చేసిన వెంకటరత్నం కలెక్టరేట్‌కు ఏవోగా బదిలీపై వెళ్లారు.

డిప్యూటీ తహసీల్దార్‌గా సలీమా

బాపట్ల పట్టణం, న్యూస్‌టుడే: మండల రెవెన్యూ కార్యాలయం డిప్యూటీ తహసీల్దార్‌గా షేక్ సలీమా శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. కర్లపాలెం మండలంలో డీటీగా పనిచేస్తూ ఆమె బదిలీపై బాపట్లకు వచ్చారు. ఇన్‌ఛార్జి తహసీల్దార్‌గా వ్యవహరిస్తున్న శ్రీదేవి బదిలీపై కర్లపాలెం మండలం డీటీగా వెళ్తున్నారు. జిల్లా ప్రధాన కేంద్రమైన బాపట్లలో తహసీల్దార్ కార్యాలయానికి సేవలకు పూర్తి స్థాయిలో తహసీల్దారును జిల్లా ఉన్నతాధికారులు నియమించలేదు. ఈ కార్యాలయానికి ఇన్‌ఛార్జితోనే నెట్టుకొస్తున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

బాపట్ల : 80085 73141, రేపల్లె : 80085 73135, వేమూరు: 91107 837382

? చావలి నుంచి పెదపలి వెళ్లే ప్రధాన రహదారి పక్కన తాగునీరు సరఫరా అయ్యే పైపు లీకవుతోంది. - స్థానికుడు, చావలి

✔ వెంటనే పంచాయతీ కార్యదర్శితో మాట్లాడి మరమ్మతులు చేయిస్తాం. - శేఖర్, ఈవోపీఆర్డీ

- వేమూరు, న్యూస్‌టుడే

? పిట్టలవానిపాలెం ప్రధాన రహదారి నుంచి సచివాలయానికి వెళ్లే రోడ్డు పక్కన మురుగు కాల్వలో వ్యర్థాలు పేరుకుపోయాయి. - నాగరాజు, పీవీపాలెం

✔ సిబ్బందిని పంపి వ్యర్థాలు తొలగించి సమస్య పరిష్కరిస్తాం. - శివకుమార్, కార్యదర్శి, పీవీపాలెం

- పిట్టలవానిపాలెం, న్యూస్‌టుడే

శక్తి స్వరూపిణి.. జగద్రక్షిణి

వైభవంగా దేవీ శరన్నవరాత్రులు



టౌన్‌హాలు మండపంలో అమ్మవారికి పూజలు | లలితాత్రిపుర సుందరి పీఠంలో గాయత్రీదేవిగా | రామాలయంలో అలంకృత దుర్గాదేవి | కన్యకాపరమేశ్వరి ఆలయంలో గాయత్రీదేవిగా | బ్రాహ్మణ సమాఖ్య మండపంలో గజలక్ష్మీదేవిగా | పాతబస్టాండ్ వెంకటేశ్వరస్వామి ఆలయంలో భవానీదేవి | శంకర విద్యాలయంలో గాయత్రీదేవి | పోలేరమ్మ ఆలయంలో గాయత్రీదేవి



గోవాడ శైవక్షేత్రంలో..

బాపట్ల, రేపల్లె, వేమూరు బృందం: బాపట్ల, రేపల్లె, వేమూరు నియోజకవర్గాల్లో దసరా నవరాత్రులు కనుల పండువగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు కొనసాగుతున్నాయి. భక్తులకు వివిధ రూపాల్లో జగన్మాత దర్శనమిస్తున్నారు. ఆలయాలు విద్యుత్తు వెలుగులతో శోభ సంతరించుకున్నాయి. పలుచోట్ల నెలకొల్పిన విగ్రహాలు కనువిందు చేస్తున్నాయి.



కర్లపాలెం: దమ్మన్నవారిపాలెంలో అమ్మవారిని దర్శించుకున్న భక్తులు | చందోలులో అన్నపూర్ణాదేవిగా బండ్లమ్మ అమ్మవారు | భవనంవారిపాలెంలో గాయత్రీదేవిగా.. | బాజీపాలెంలో గజలక్ష్మిగా.. | అల్లూరులో శ్రీమహాలక్ష్మీదేవిగా.. | కావూరులో గాయత్రీదేవి అమ్మవారు | మహాలక్ష్మీదేవిగా నడింపల్లి రెడ్డికమ్మ అమ్మవారు | రాజోలులో అమ్మవారి అలంకరణ



రైలుపేటలో గౌరీదేవి అలంకరణ | వాసవికన్యకాపరమేశ్వరి ఆలయంలో.. | పేటేరులో గాయత్రీదేవి | బేతపూడిలో విజయదుర్గాదేవి | చెరుకుపల్లిలో గాయత్రీదేవిగా.. | నగరంలో.. | నిజాంపట్నం జల్సా బజారులో అమ్మవారు | వలివేరులో అన్నపూర్ణాదేవిగా.. | చావలి వాలేశ్వర స్వామి ఆలయంలో లలితాదేవిగా..

ప్రపంచ జంతు సంక్షేమ దినోత్సవం

నగరం: వెలగపూడి రామకృష్ణ డిగ్రీ కళాశాలలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ జువాలజీ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ జంతు సంక్షేమ దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపల్ హరికృష్ణ మాట్లాడుతూ ప్రకృతిలోని జంతుజీవాలను రక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. అనంతరం విద్యార్థులు తయారు చేసిన జంతు నమూనాలు వీక్షించి ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించారు.

గట్లను శుభ్రం చేసుకోవాలి

చుండూరు: వరి రైతులు పొలం చుట్టూ ఉన్న గట్లను శుభ్రం చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి రామకృష్ణ సూచించారు. మండలంలోని మోదుకూరు, పెదగాదెలవర్రులోని వరిపొలాలను పరిశీలించారు. ప్రస్తుతం వరికి పోటాష్ వాడడం వల్ల పంట నాణ్యత, దిగుబడి బాగుంటుందని చెప్పారు. ఎరువులు అందుబాటులో ఉన్నాయా అని రైతులను ప్రశ్నించారు. అన్నదాతలు ఎప్పటికప్పుడు వరిని పరిశీలించుకుని, వ్యవసాయ సూచనలు తీసుకుని సస్యరక్షణ చర్యలు చేపట్టాలని కోరారు.

సోదరభావంతో మెలగాలి

బాపట్ల పట్టణం: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు సోదరభావంతో మెలగాలని గ్రామీణ సీఐ గంగాధర్ చెప్పారు. శుక్రవారం రాత్రి పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో అడవి పంచాయతీ పరిధిలోని కొత్తఓడరేవు గ్రామంలో పల్లె నిద్ర నిర్వహించారు. వివాదాలు, ఘర్షణలకు తావు లేకుండా తమ పిల్లల భవిష్యత్తుపై దృష్టి సారించాలని ప్రజలకు సూచించారు.

పంచాయతీ కార్యదర్శుల బదిలీ

బాపట్ల పట్టణం: పలు పంచాయతీల కార్యదర్శులు శుక్రవారం బదిలీ అయ్యారు. మండలంలో మొత్తం 28మంది పంచాయతీ కార్యదర్శులు ఉండగా సాధారణ బదిలీల్లో భాగంగా మండల పరిధిలోని స్టువార్టుపురం కార్యదర్శి డి.శ్రీనివాసరావు కర్లపాలెం మండలం పేరలికి, చెరువు-2 పంచాయతీ కార్యదర్శి వన్య చందోలుకు బదిలీ అయ్యారు. స్టువర్టుపురం, ముత్తాయపాలెం, మూలపాలెం పంచాయతీలకు ఇంకా కార్యదర్శులను నియమించలేదు.

ఘనంగా శ్రీగాయత్రి హోమం



హోమాలు నిర్వహిస్తున్న గోశాల నిర్వాహకులు, భక్తులు

బాపట్ల పట్టణం, న్యూస్‌టుడే: దేవీశరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం శ్రీమహర్షి ఆశ్రమ గోశాలలో అమ్మవారికి విశిష్ట పూజలు, అర్చనలు, అభిషేకాలు చేశారు. గోపూజ, మహాకాళి, మహాలక్ష్మి, మహాసరస్వతి సమేత రాజరాజేశ్వరికి కుంకుమార్చనలు జరిగాయి. వేదపండితులు గాయతి హోమం నిర్వహించారు.

7 నుంచి 9 వరకు స్పాట్ అడ్మిషన్లు

రేపల్లె అర్బన్: రేపల్లె అనగాని భగవంతరావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రథమ ఏడాదిలో చేరే విద్యార్థులకు ఈనెల 7 నుంచి 9 వరకు స్పాట్ అడ్మిషన్లు జరుగుతాయని ప్రధాన అధ్యాపకుడు రవిచంద్రకుమార్ తెలిపారు. ఒరిజినల్ ధ్రువపత్రాలతో కళాశాల కార్యాలయాన్ని నేరుగా సంప్రదించాలన్నారు.

'జగన్‌కు భవిష్యత్తులో జైలుశిక్ష తప్పదు'

బాపట్ల పట్టణం, న్యూస్‌టుడే: జగన్ తన అవినీతి, అరాచక పాలనలో దోచుకున్న రూ.లక్షల కోట్ల స్కాంలు రాజకీయ సమాధి కట్టేందుకు సిద్ధంగా ఉన్నాయని, భవిష్యత్తులో అవినీతి కేసులో ఆయనకు జైలు శిక్ష తప్పదని సంగండెయిరీ మాజీ ఛైర్మన్ కొల్లా వీరయ్యచౌదరి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వ పాలనపై ప్రజల్లో ఆగ్రహం మొదలైందని జగన్ పగటి కలలు కంటున్నారని ఎద్దేవా చేశారు.

సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి



ఎస్టీకాలనీ వాసులతో అధికారులు

నగరం: యానాది, మత్స్యకారుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని మత్స్యశాఖ ఏడీ సైదా నాయక్ అన్నారు. నగరం ఎస్టీ కాలనీలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు-లబ్ధిదారులు అన్న విషయముపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మత్స్యకారులు, యానాదులకు మెరుగైన జీవన విధానాన్ని అందించేలా ప్రభుత్వం రాయితీలతో కూడిన సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. చేపల వేటకు ఉపయోగపడే వలలు, వాహనాలు, ఇతర వస్తువులను ప్రభుత్వం రాయితీపై అందిస్తుందన్నారు. వాటిని సద్వినియోగం చేసుకుని అభివృద్ధి సాధించాలని సంఘ సభ్యులకు సూచించారు. మత్స్యకారులు, యానాది సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఇసుక అందుబాటులోకి తీసుకురావాలి



నినాదాలు చేస్తున్న సీపీఎం నేతలు, కార్మికులు

రేపల్లె అర్బన్ న్యూస్‌టుడే: ఉచిత ఇసుకను తక్షణం అదుబాటులోకి తీసుకురావాలని సీపీఎం రేపల్లె కార్యదర్శి చిక్కాల మణిలాల్ డిమాండ్ చేశారు. ఉచిత ఇసుక హామీని వెంటనే అమలు చేయాలని కోరుతూ శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఇసుక విషయంలో ప్రభుత్వం చెప్పిన మాటలు ఆచరణలో కొరవడ్డాయన్నారు. ఇసుక లేక భవన నిర్మాణ కార్మికులు ఉపాధికి దూరమవుతున్నారని, ఉచితంగా ఇస్తున్నామంటూ వివిధ ఛార్జీల పేరుతో రూ.వేలు ప్రజల నుంచి అక్రమంగా వసూలు చేస్తున్నారని ఆరోపించారు. కృష్ణానది పక్కనే ఉన్నా రేపల్లెలో ట్రాక్టరు ఇసుక రూ.5 వేల నుంచి రూ.6 వేల చొప్పున కొందరు దళారులు విక్రయిస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు కూడా భవన నిర్మాణ కార్మికులను రోడ్డున పడేసేలా ఉన్నాయని విమర్శించారు. ఉచిత ఇసుకను అందుబాటులోకి తీసుకురాకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించి తహసీల్దారు మోర్ల శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. సీపీఎం, భవన నిర్మాణ కార్మిక సంఘ నేతలు కిశోర్, ఆశీర్వాదం, గోపి, మావో, అగస్టీన్, ధర్మరాజు, చిట్టిబాబు, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

డిస్‌ప్లే బాగు చేయరా!



పనిచేయని పెట్రోల్ బంకు డిస్‌ప్లే

నగరం, న్యూస్‌టుడే: నగరంలోని ఇండియన్ ఆయిల్ పెట్రోల్ బంకులో డిస్‌ప్లే బోర్డులు పని చేయడం లేదని వినియోగదారులు వాపోతున్నారు. ఐదారు నెలలుగా బంకులో ఉన్న రెండు డిస్‌ప్లేలు పని చేయడం లేదు. వినియోగదారులకు బండిలో ఎంత కొడుతున్నారో లెక్క తెలియక ఇబ్బందులు పడుతున్నారు. అప్పుడప్పుడు వివాదాలకు దిగుతున్నారు. సంబంధిత యాజమాన్యం కావాలనే వినియోగదారులను మోసం చేస్తుందని కొందరు వినియోగదారులు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ప్రదర్శన బోర్డులు పనిచేసేలా చూడాలని వినియోగదారులు కోరుతున్నారు.

ఈకేవైసీ తప్పనిసరి

కర్లపాలెం, న్యూస్‌టుడే: పంట నమోదు చేసుకున్న రైతులు తప్పనిసరిగా ఈనెల 7తేదీ లోపు ఈకేవైసీ చేయించుకోవాలని ఏడీఏ లక్ష్మీ తెలిపారు. మండల కేంద్రం కర్లపాలెంతో పాటు చింతాయపాలెం, పేరలి, సమ్మెటవారిపాలెం, యాజలి గ్రామాల్లో పంట నమోదు ప్రక్రియను అధికారులు, రైతులతో కలిసి ఆమె పరిశీలించారు. పంట నమోదు చేసుకున్న రైతులకు మాత్రమే పంటల బీమా, కనీస మద్దతు ధర, సున్నా వడ్డీ పంట రుణాలు వర్తిస్తాయని చెప్పారు. మండల వ్యవసాయాధికారి సుమంత్‌కుమార్, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.



పంట నమోదు వివరాలను పరిశీలిస్తున్న ఏడీఏ లక్ష్మీ

రేపల్లె అర్బన్ న్యూస్‌టుడే: పంట నమోదు చేయించుకున్న రైతులు ఈనెల 7లోగా ఈకేవైసీ చేయించుకోవాలని వ్యవసాయశాఖ రేపల్లె సహాయ సంచాలకులు రాగల విజయబాబు చెప్పారు. రేపల్లె మండలం చోడాయపాలెం, పిరాట్లంక, గంగడిపాలెంలో శుక్రవారం ఆయన పర్యటించి పంట నమోదు చేసుకున్న రైతుల వివరాలు తెలుసుకున్నారు.

కేజీ బేసిన్‌లో ఏపీకి వాటా ఇవ్వాలని డిమాండ్



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి గంగయ్య

బాపట్ల, న్యూస్‌టుడే: కేజీ బేసిన్‌లో ఆంధ్రప్రదేశ్‌కు 50 శాతం వాటా ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.గంగయ్య డిమాండ్ చేశారు. కృష్ణా-గోదావరి బేసిన్ సాధన సమితి ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద శుక్రవారం నిర్వహించిన ధర్నాలో ఆయన మాట్లాడారు. విశాఖ ఉక్కును ప్రైవేటీకరించవద్దన్నారు. కేజీ బేసిన్‌లో వాటా వస్తే ఏపీకి ఆర్థిక ఇబ్బందులు తొలగి శరవేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. సమితి ప్రతినిధులు కె.విజయ్‌కుమార్, ఎం.ఆంజనేయులు, పీసీ సాయిబాబు, జీవీ, జెడ్ బాషా, కె.రవీంద్రబాబు, శరత్ తదితరులు పాల్గొన్నారు.

పారితోషికం పెంపుపై హర్షం

చెరుకుపల్లి: రాష్ట్రంలో ధూపదీప నైవేద్యం పథకం కింద ఆలయాల్లో పనిచేసే అర్చకుల పారితోషికం, పడితరం పెంచుతూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయటంపై అర్చకసంఘ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. గతంలో ఈ పథకం కింద ఆలయాల్లో పనిచేసే అర్చకులకు నెలకు రు.3వేలు, పడితరం కింద రు.2వేలు అందేవని, యువగళంలో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వ రు.5 వేలుగా ఉన్న వాటిని రూ.10వేలకు (అర్చకులకు రు.7వేలు, పడితరం రూ.3వేలు) పెంచుతూ ఆదేశాలు జారీ చేసిందని అర్చక సంఘ నాయకులు పొన్నపల్లి సత్యనారాయణ, స్వర్ణ శ్రీనివాసశర్మ తెలిపారు.

రజకపేటలో వసతులు కల్పించండి

నిజాంపట్నం: నిజాంపట్నం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల వెనుక, రజకపేట సమీపంలో ఉంటున్న తాము మౌలిక వసతులు లేక చినుకు పడితే వాన నీటిలో రాకపోకలు సాగించాల్సి వస్తుందని, విద్యుత్తు స్తంభాల సమస్య ఉందని, ముళ్ల, పిచ్చి మొక్కలు పెరిగి విష జంతువులతో సతమతమవుతున్నామని స్థానికులు తెదేపా పట్టణ అధ్యక్షుడు బొమ్మిడి రామకృష్ణ వద్ద శుక్రవారం సమస్యలు ఏకరువు పెట్టారు.

గోవాడ ఆలయ ఈవోగా అశోక్‌కుమార్

గోవాడ, (అమృతలూరు): గోవాడ శ్రీబాలకోటేశ్వరస్వామి ఆలయ ఈవోగా అశోక్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన చిలకలూరిపేట గ్రూపు దేవస్థానాల కార్యనిర్వహణ అధికారిగా చేస్తూ గోవాడ ఆలయ అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన స్వామివారికి పూజలు జరిపించారు. ఇక్కడ పనిచేస్తున్న ఈవో అశోక్‌రెడ్డి నల్లపాడు గ్రూపు దేవస్థానాలకు బదిలీపై వెళ్లారు.

ఏఈ బాధ్యతల స్వీకరణ

చెరుకుపల్లి గ్రామీణ: చెరుకుపల్లి విద్యుత్తు శాఖ నూతన ఏఈగా పెరుగు శ్రీనివాసరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. బదిలీల్లో భాగంగా ఆయన బాపట్ల పట్టణం నుంచి ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేసిన బాషా కర్లపాలెం ఏఈగా బదిలీపై వెళ్లారు.

భట్టిప్రోలు: మండల ఎంపీడీవోగా ఎన్.వి.రమణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఎంపీపీ దావూరి వెంకటలలితకుమారి, సిబ్బంది పూలమాలలతో అధికారిని సత్కరించారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

పిట్టలవానిపాలెం: ప్రజావేదిక ద్వారా సమస్యలను తన దృష్టికి తెస్తే పరిష్కరిస్తానని ఎమ్మెల్యే నరేంద్రవర్మ అన్నారు. మండల కేంద్రంలోని తెదేపా కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రజావేదికలో ఆయన మాట్లాడారు. వారంలో ప్రతి శుక్రవారం పిట్టలవానిపాలెం తెదేపా కార్యాలయంలో నిర్వహించే ప్రజావేదిక ద్వారా ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు. అధికారులు లంచం అడిగితే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

ఆరోగ్యం.. ఆనందం

శారీరక దారుఢ్యానికి జిమ్‌లో అతివల కసరత్తులు

న్యూస్‌టుడే, బాపట్ల



కసరత్తులు చేస్తున్న మహిళలు

మహిళలు ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. దైనందిన జీవితంలో తీవ్ర ఒత్తిడి, ఊబకాయం సమస్యలతో బాధపడుతున్న అతివలు జిమ్‌కు వెళ్లి రెండు గంటలు శిక్షకుల సమక్షంలో కఠోర సాధన చేస్తున్నారు. శారీరక కసరత్తులు చేస్తూ చెమటోడ్చుతున్నారు. ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ శారీరక దారుఢ్యాన్ని మెరుగుపరుచుకుంటున్నారు. అతివల కోసం జిమ్ నిర్వాహకులు ప్రత్యేక సమయం కేటాయిస్తున్నారు.

● గతంలో జిమ్‌ల్లో యువత మాత్రమే కనిపించేవారు. కళాశాల విద్యార్థులతో పాటు సైన్యం, పోలీసుశాఖలో ఉద్యోగాల కోసం సిద్ధమయ్యే అభ్యర్థులు జిమ్‌కు వచ్చి శిక్షకుల సమక్షంలో కష్టించి సాధన చేసేవారు. యువ క్రీడాకారులు సైతం శారీరక దారుఢ్యం కోసం జిమ్‌కు వస్తున్నారు. గతంలో నగరాల్లో మాత్రమే మహిళల కోసం ప్రత్యేకంగా జిమ్‌లు ఉండేవి. యువతులు, మహిళలు రోజూ వెళ్లి శిక్షకుల సమక్షంలో శారీరక కసరత్తులు చేస్తున్నారు. ప్రస్తుతం ఆ సంస్కృతి బాపట్ల వంటి మధ్యస్థాయి పట్టణాలకు వ్యాపించింది. ఊబకాయం, ఒత్తిడి, నడుం నొప్పి, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న మహిళలు ఆరోగ్య సంరక్షణ, శారీరక దారుఢ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. జిమ్‌లో ఉదయం, సాయంత్రం ప్రత్యేకంగా రెండు, మూడు గంటలు శ్రమిస్తున్నారు. బాక్సింగ్, సైక్లింగ్, ట్రెడ్‌మిల్‌పై నడవటం, స్కిప్పింగ్, బరువులు ఎత్తటం వంటి కసరత్తులు చేస్తున్నారు. సాధన ద్వారా ఒత్తిడి, అధిక బరువు సమస్యలను నియంత్రించుకుంటున్నారు. ఆరోగ్యం కాపాడుకుంటూ ఉత్సాహంగా దైనందిన జీవితం గడుపుతున్నారు.

ఐదు నెలలుగా సాధన: స్వరూప, మహిళ



ఇటీవల బరువు పెరగటంతో ఏ పని చేసినా అలసట వస్తోంది. ఎక్కువ దూరం నడవలేకపోతున్నా. మెట్లు ఎక్కాలన్నా ఇబ్బందిగా ఉంది. జిమ్‌లో చేరి ఐదు నెలలుగా సాధన చేస్తున్నా. చాలామార్పు కనిపించింది. నీరసం, అలసట పోయి నూతనోత్తేజం వచ్చినట్లుంది. రోజూ బాక్సింగ్, సైక్లింగ్ చేస్తూ బరువులు ఎత్తుతూ శారీరక దారుఢ్యాన్ని పెంచుకుంటున్నా. అన్ని వయసుల మహిళలు జిమ్‌కు వస్తున్నారు.

చలాకీగా ఉంటున్నా: హిమ



ఆరు నెలలుగా జిమ్‌కు వస్తున్నా. రోజూ రెండుగంటలు శారీరక కసరత్తులు, సైక్లింగ్ చేస్తూ బరువులు ఎత్తుతున్నా. తగిన వ్యాయామం చేయటం ద్వారా చలాకీగా ఉంటున్నా. అన్ని పనులు ఉత్సాహంగా చేస్తున్నా. బరువును నియంత్రణలో ఉంచుకుంటున్నా. శారీరక దారుఢ్యం పెరిగింది. ఆత్మవిశ్వాసం పెరిగింది. ప్రతిఒక్కరూ తమ ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి.

ఒత్తిడి నుంచి ఉపశమనం: సైదాబీ, శిక్షకురాలు



జిమ్‌లో రెండేళ్లు కఠోర సాధన చేసి శారీరక దారుఢ్యం సాధించా. బరువును నియంత్రించుకుని ఒత్తిడి లేకుండా ఉల్లాసంగా ఉంటున్నా. శిక్షకురాలిగా మారా. విద్యార్థినులు, సాధారణ గృహిణులు, ఉద్యోగులతో సహా ప్రతి మహిళ ఆరోగ్యంపై ప్రత్యేకంగా దృష్టి పెడుతూ శారీరక కసరత్తులు చేస్తున్నారు. బరువు తగ్గి రోజు వారీ జీవితాన్ని ఉత్సాహంగా గడుపుతున్నారు. మధుమేహం నుంచి బయటపడుతున్నారు. నడుము నొప్పి, ఇతర ఆరోగ్య సమస్యలు పోయి ఉపశమనం పొందుతున్నారు. మహిళల కోసం ప్రత్యేక సమయం కేటాయించాం.

బాపట్ల అభివృద్ధికి బాటలు వేసిన వెలగపూడి

బాపట్ల, న్యూస్‌టుడే: పురపాలక సంఘం ప్రథమ ఛైర్మన్‌గా బాపట్ల ప్రగతికి వెలగపూడి సుబ్బారావు ఎనలేని కృషి చేశారని ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి పీసీ సాయిబాబు అన్నారు. వెలగపూడి వర్ధంతి సందర్భంగా ఫోరం ఆధ్వర్యంలో చంద్రకళా పార్కులోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. సాయిబాబు మాట్లాడుతూ స్వాతంత్ర సమరయోధుడిగా, వ్యవసాయ కళాశాల, రోటరీ క్లబ్ స్థాపనలో విశేష సేవలు అందించారన్నారు. సరస్వతి విద్యాసంస్థల కోసం పట్టణ నడిబొడ్డున అర ఎకరా భూమి దానం చేశారని తెలిపారు. ఆదర్శ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ సయ్యద్ నజీర్ అహ్మద్, విద్యార్థులు పాల్గొన్నారు.

కాలువలో దూకి యువకుడి గల్లంతు

బాపట్ల పట్టణం, న్యూస్‌టుడే: నాగరాజు కాలువలోకి దూకి యువకుడు గల్లంతయ్యాడు. పట్టణంలోని ఉప్పరపాలేనికి చెందిన ఈవూరి సాంబశివరావు కుమారుడు నాగరాజు స్థానిక ఎస్ఎన్‌పీ అగ్రహారం సమీపంలో బిర్యాని దుకాణం నిర్వహిస్తూ జీవనం సాగిస్తుంటాడు. శుక్రవారం రాత్రి తన ద్విచక్రవాహనంపై మండల పరిధిలోని గుంటూరు వెళ్లే రహదారిలోని నాగరాజు కాలువ వద్దకు వెళ్లి వాహనాన్ని నిలిపి వంతెనపై నుంచి దూకేశాడు. ఆ సమయంలో జనసంచారం లేకపోవటం, ఆ ప్రాంతం చీకటిగా ఉండటంతో గాలింపు చర్యల్లో ఆలస్యమవుతుందని గ్రామీణ పోలీసులు తెలిపారు.

ద్విచక్ర వాహనదారుడికి గాయాలు

బాపట్ల పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని శృంగారపురానికి చెందిన వడ్లమూడి శ్రీనివాసులు అనే వ్యక్తి శుక్రవారం రాత్రి తన ద్విచక్ర వాహనంపై చీలురోడ్డు వైపు వెళ్తుండగా పటేల్‌నగర్ మలుపు వద్ద గుర్తుతెలియని ద్విచక్రవాహనం ఢీ కొట్టింది. ఘటనలో గాయపడిన శ్రీనివాసులను ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పట్టణ ఎస్సై చంద్రావతి కేసు నమోదు చేశారు.

ట్రాక్టర్‌లో గడ్డి దగ్ధం

భట్టిప్రోలు, న్యూస్‌టుడే: ప్రధాన రహదారి మార్గంలో చావలి సెంటరు వద్ద శుక్రవారం రాత్రి గడ్డి ట్రాక్టరు దగ్ధమైంది. ట్రాక్టరుపై ఉన్న డ్రైవరు, ఇద్దరు వ్యక్తులు వెంటనే దూకారు. స్థానికులు గృహాల్లోని మోటార్ల ద్వారా మంటలు ఆర్పారు. ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదు.

చీరాల

• చీరాల • అద్దంకి • పర్చూరు



రూ.1,23,200 చెక్కును ఎంపీ పురందేశ్వరి, మంత్రి రవికుమార్, ఎమ్మెల్యే సాంబశివరావుకు అందజేస్తున్న కారంచేడు మండలం ఎరువులు, పురుగుమందుల డీలర్లు



రూ.1.23 లక్షల నగదు చెక్కును ఏలూరికి అందజేస్తున్న చినగంజాం మండలం కడవకుదురు గ్రామ వీవోఏ ప్రతినిధులు

వరద బాధితులకు వెల్లువెత్తిన విరాళాలు

మార్టూరు, కారంచేడు, న్యూస్‌టుడే: విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు దాతలు తమ విరాళాలను అందజేశారు. శుక్రవారం ఇసుకదర్శి ఏలూరి క్యాంపు కార్యాలయానికి విచ్చేసిన నియోజక వర్గ ప్రజలు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావుకు సంబంధిత నగదు, చెక్కులను అందించారు. ఎమ్మెల్యే ఏలూరి ద్వారా ప్రభుత్వానికి అందేలా చొరవ చూపాలని కోరారు.

చీరాల, న్యూస్‌టుడే: వరద బాధితుల సహాయార్థం ఆర్కే ఓరియంటల్ హైస్కూల్ రూ. 50,000, వాసవీ హైస్కూల్ రూ.50,116 యాజమాన్యంతో పాటు విద్యార్థులు సీఎం సహాయ నిధికి విరాళాన్ని ప్రకటించారు. దీనికి సంబంధించిన చెక్కును ఎమ్మెల్యే ఎంఎం కొండయ్యకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విద్యార్థులు సేవా భావాన్ని కొనియాడటంతో పాటు యాజమాన్యాలను అభినందించారు. పార్టీ అధికార ప్రతినిధి మద్దులూరి మహేంద్రనాథ్, పార్టీ నాయకులు ఉన్నారు.



రూ. లక్ష చెక్కు ఎమ్మెల్యే ఏలూరికి ఇస్తున్న చినగంజాం మండలం సంతరావూరు గ్రామ ప్రజలు



రూ.50 వేల నగదును అందజేస్తున్న ఇంకొల్లు ఎంఆర్ఆర్ ఉన్నత పాఠశాల యాజమాన్యం



ఎమ్మెల్యే కొండయ్యకు చెక్కు అందజేస్తున్న పాఠశాలల ప్రతినిధులు

గ్రామాల్లో మౌలిక వసతులకు ప్రాధాన్యం

మార్టూరు, న్యూస్‌టుడే: నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని, సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. మండలంలోని ఇసుకదర్శి క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆర్‌డబ్ల్యూఎస్, రెవెన్యూ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గ్రామాల్లోని రహదారులు, మురుగు కాల్వలు, విద్యుత్తు, రెవెన్యూ, మంచి నీటి సౌకర్యాలకు ప్రాధాన్యం కల్పించేలా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని కోరారు.

బైపాస్ కూడళ్లలో రక్షణేదీ?

అంతటా అంధకారం

విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేయాలంటున్న ప్రజలు

చీరాల, న్యూస్‌టుడే

విద్యుత్తు దీపాలు లేవు.. సూచిక బోర్డులు కనిపించవు.. మితిమీరిన వేగం.. వెరసి 216 బైపాస్ అంటేనే ప్రమాదాలకు నిలయంగా మారుతోంది. పలువురు మృత్యువాత పడుతున్నా.. మరెందరో క్షతగాత్రులవుతున్నా అధికారులు చోద్యం చూస్తున్నారు తప్ప.. తగిన చర్యలు తీసుకోవడంలేదు. . ఇప్పటికైనా స్పందించాల్సి ఉంది.

కత్తిపూడి నుంచి ఒంగోలు త్రోవగుంట వరకు ఉన్న ఈ బైపాస్.. చీరాల నియోజకవర్గంలో పందిళ్లపల్లి వద్ద నుంచి తోటవారిపాలెం వరకు ఉన్న గ్రామాలను తాకుతూ పోతుంది. వేటపాలెం నుంచి వాడరేవు కూడలి మధ్యలో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. దీనికి ప్రధాన కారణం రహదారి వెంబడి గ్రామాలు ఉండటంతో ఈ ప్రజలు పట్టణంలోకి రావాలన్నా గ్రామాలకు వెళ్లాలన్నా కచ్చితంగా బైపాస్‌ను దాటాలి. ఇటీవల కాలంలో బైపాస్‌ను ఆనుకొని విపరీతంగా టీ దుకాణాలు, రెస్టారెంట్లు వెలిశాయి. వీటి వద్ద సూచికలు లేవు. ఇక్కడ వాహనాలు అడ్డదిడ్డంగా రహదారిపైనే నిలుపుతున్నారు. దీనికితోడు రామాపురం జంక్షన్ పక్కన రహదారి వెంబడి గ్రామాల్లో సేకరించిన చెత్తాచెదారం వేస్తున్నారు. కొన్నిచోట్ల జంతువుల వ్యర్థాలు వేయడం వల్ల అక్కడ కుక్కలు, ఇతర జంతువులు కొట్లాడు కుంటూ బైపాస్‌పైకి వస్తున్నాయి.



కొత్తపేట జంక్షన్

మన్నం అపార్టుమెంటు దగ్గర ప్రమాదాల తీవ్రత అధికంగా ఉంది.

రోడ్డు దాటాలంటే...

రాత్రి సమయాల్లో బైపాస్‌లో చీకటి రాజ్యమేలుతోంది. ముఖ్యంగా గ్రామాలకు వెళ్లే కూడళ్ల వద్ద ఎటువంటి విద్యుత్తు దీపాలు లేవు.. దీంతో రాత్రి సమయాల్లో ఇక్కడ రోడ్డు దాటాలంటే చాలా ఇబ్బందిగా ఉంటుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఒకసారి ఈ కూడళ్లలో వీధిదీపాలు ఏర్పాటు చేసే ప్రక్రియపై సర్వేచేసిన అధికారులు తరువాత పట్టించుకోలేదు. వేటపాలెం వెళ్లే జంక్షన్ వద్ద సరైన సూచికలు, విద్యుత్తు దీపాలు లేకపోవటంతో వాహనదారులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. బచ్చులవారిపాలెం వెళ్లే పాయింట్ వద్ద ఎటువంటి ప్రమాద సూచికలు లేవు. పొట్టిసుబ్బయ్యపాలెం వెళ్లే కూడలి వద్ద నిత్యం ట్రాఫిక్ రద్దీ ఉంటోంది. ఇక్కడ అనేక దుకాణాలు వెలిశాయి. సరైన పర్యవేక్షణలేదు. చల్లారెడ్డిపాలెం జంక్షన్‌కు జాండ్రపేట నుంచి వచ్చే రహదారి కలుస్తుంది. ఊరు బైపాస్‌కు ఆనుకొనే ఉంటుంది. ఇక్కడ వాహనాల వేగం నియంత్రణకు సరైన ఏర్పాట్లు లేవు. గతంలో ద్విచక్ర వాహనంపై జాండ్రపేట నుంచి వస్తున్న ఇద్దరు విద్యార్థులను మినీ లారీ ఢీకొనటంతో అక్కడికక్కడే మృతి చెందారు. దీంతోపాటు అనేక ప్రమాదాలు జరిగాయి. అయినా చర్యలు నామమాత్రం.

రామాపురం జంక్షన్‌లో తీరానికి వెళ్లే వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఇక్కడ రాత్రి అయితే చీకటే.. ఈ సమీపంలోనే అనేక ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నా రక్షణ ఏర్పాట్లు శూన్యం. ఇక వాడరేవు జంక్షన్‌లోనూ అనేక ప్రమాదాలు జరిగాయి. తోటవారిపాలెం.. పిట్టువారిపాలెం జంక్షన్ పరిస్థితి ఇంకా దారుణంగా ఉంది. గతంలో ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఉన్న సమయంలో అప్పటి ఎస్పీ మల్లికాగర్గ్ ఆదేశాల మేరకు ప్రమాదాలు తగ్గించేందుకు కూడళ్ల వద్ద స్టాపర్లు, డ్రమ్ములు ఏర్పాటు చేశారు. ఇది సత్ఫలితాన్నే ఇచ్చింది. ప్రస్తుతం వాటిని పట్టించుకోవటం లేదు. ఈ బైపాస్ ప్రాంతంలోనే రెండు ఇంజినీరింగ్ కళాశాలలు ఉన్నాయి. మితిమీరిన వేగం, సూచికలు, జంక్షన్ల వద్ద వెలుతురు లేకపోవటంతో అనేక మంది విద్యార్థులు క్షతగాత్రులయ్యారు, కొందరు ప్రాణాలు కోల్పోయారు. గ్రామస్థులు ప్రాణాలు విడిచారు.

రాత్రివేళ వెళ్లాలంటే భయమే



రాత్రి సమయాల్లో బైపాస్‌లో వెళ్లాలంటే భయంగా ఉంటుంది. జంక్షన్ల వద్ద చీకటిగా ఉంటుంది. ఎన్నిసార్లు విజ్ఞప్తిచేసిన దీపాలు ఏర్పాటు చేయటంలేదు. ఇప్పటికైనా సమస్యను పరిష్కరించాలి. - నాగరాజు

రాజుపాలెంలో అండర్‌పాస్ ఏర్పాటుకు వినతి

మార్టూరు, కారంచేడు, న్యూస్‌టుడే: చెన్నై- కోల్‌కతా 16 నంబరు జాతీయ రహదారిపై నిత్యం ప్రమాదాలకు నిలయమైన రాజుపాలెం కూడలి వద్ద అండర్‌పాస్ నిర్మాణానికి తోడ్పాటు అందించాలని ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరిని ఏఎంసీ మాజీ ఛైర్మన్ జాస్తి వెంకటనారాయణ కోరారు. కారంచేడు విచ్చేసిన ఎంపీ పురందేశ్వరిని శుక్రవారం జాస్తి, రాజుపాలెం గ్రామస్థులతో కలిసి వినతిపత్రం అందజేశారు. పర్చూరు-బల్లికురవ ప్రధాన మార్గమైన ఇక్కడ అండర్‌పాస్ లేకపోవటంతో ప్రమాదాలకు నెలవై పెద్దసంఖ్యలో ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నట్లు ఎంపీకి వివరించారు. స్పందించిన పురందేశ్వరి కేంద్ర రహదారి శాఖ మంత్రి నితిన్ గడ్కరీ కార్యాలయ ప్రతినిధులతో ఫోన్‌లో మాట్లాడారు. రాజుపాలెం, దేగరమూడి కూడలి వద్ద వంతెన ఏర్పాటుకు కృషి చేస్తానని ఆమెను కలిసిన గ్రామస్థులకు వెల్లడించారు.



పురందేశ్వరికి వినతిపత్రం అందిస్తున్న జాస్తి వెంకటనారాయణ, రాజుపాలెం గ్రామస్థులు

కారంచేడు అదనపు తహసీల్దార్‌గా అనిత

కారంచేడు(మార్టూరు): కారంచేడు అదనపు తహసీల్దార్‌గా ఉపతహసీల్దార్ అనిత శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. కారంచేడు తహసీల్దార్‌గా విచ్చేసిన నరసింహారావు నెల రోజుల్లోనే బదిలీపై రేపల్లె ప్రాంతానికి వెళ్లారు. దీంతో డీటీగా పనిచేస్తున్న అనితకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు ఇచ్చారు. పలువురు తెదేపా నేతలు తహసీల్దార్ అనితను కార్యాలయంలో కలిసి అభినందనలు తెలిపారు. వారిలో కొల్లా సుబ్బారాయుడు, కొనరాజు హనీ, శ్రీహరి తదితరులు ఉన్నారు.

పర్చూరు ఏపీవోగా రామకృష్ణ

పర్చూరు(మార్టూరు), న్యూస్‌టుడే: పర్చూరు మండలం ఏపీవోగా కె.రామకృష్ణ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. రామకృష్ణ బాపట్ల నుంచి వచ్చారు. అలాగే పర్చూరు క్లస్టర్ సీసీగా విజయకుమార్, అడుసుమల్లి క్లస్టర్ సీసీగా ప్రమీల, వీరన్నపాలెం క్లస్టర్ శ్రీనివాస మూర్తి, చెరుకూరు క్లస్టర్ సీసీగా నరసింహారావులు బదిలీపై బాధ్యతలు స్వీకరించారు.



పోలీస్‌స్టేషన్‌లో దస్త్రాలు పరిశీలిస్తున్న బాపట్ల డీఎస్పీ రామాంజనేయులు

అపరిష్కృత కేసులపై దృష్టి

బల్లికురవ(అద్దంకి), న్యూస్‌టుడే: దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న కేసులపై దృష్టి సారించి, వాటిని పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని బాపట్ల డీఎస్పీ జి.రామాంజనేయులు అన్నారు. వార్షిక తనిఖీలో భాగంగా బల్లికురవ పోలీస్‌స్టేషన్‌ను ఆయన శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై జీవీ. చౌదరికి సూచనలు చేశారు. ఇతర రాష్ట్రాల నుంచి జీవనం కోసం గ్రానైట్ క్వారీలకు, వారి కుటుంబ సభ్యులు వస్తుంటారని, అలాంటి వారి విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. దొంగతనాలు జరగకుండా రాత్రి పూట గస్తీని పెంచాలన్నారు. ప్రజలతో ఫ్రెండ్లీ పోలీసింగ్ కొనసాగించాలని సూచించారు.

చీరాల కమిషనరుగా అబ్దుల్ రషీద్



చీరాల అర్బన్, న్యూస్‌టుడే: చీరాల మున్సిపల్ కమిషనరుగా అబ్దుల్ రషీద్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన వెంకటగిరి నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. మొన్నటి వరకు కమిషనరుగా పనిచేసిన కె. చక్రవర్తి వ్యవసాయ శాఖ నుంచి డిప్యుటేషన్‌పై వచ్చారు. ప్రస్తుతం అక్కడే బదిలీ అయ్యారు.

సంక్షేమ ఫలాలు పేదలకు అందేలా కృషి



సింగయ్య

అద్దంకి, న్యూస్‌టుడే: ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ ఫలాలు పేదలందరికీ అందేలా కృషి చేస్తానని ఎంపీడీవో బి.సింగయ్య అన్నారు. శుక్రవారం ఉదయం ఆయన ఈవో ఆర్డీ ఆర్‌వీఎస్.ప్రసాద్ నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. గతంలో జే పంగులూరు, మార్టూరు, అద్దంకిలో ఎంపీడీవోగా, మెప్మా పీడీగా, డ్వామా సమాఖ్య అదనపు సంచాలకులుగా పనిచేసినట్లు చెప్పారు. ఎన్నికల సమయంలో తిరుపతి జిల్లా దొరవారిసత్రం ఎంపీడీవోగా బదిలీపై వెళ్లినట్లు తిరిగి ప్రకాశం జిల్లాకు రాగా అద్దంకి బదిలీ చేసినట్లు చెప్పారు.

వేద మాత గాయత్రీ నమోస్తుతే..

చీరాల అర్బన్, వేటపాలెం, అద్దంకి, జే పంగులూరు, పర్చూరు, కారంచేడు(మార్టూరు) యద్దనపూడి, మార్టూరు, ఇంకొల్లు, చినగంజాం, న్యూస్‌టుడే: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో రెండో రోజు చీరాల, పర్చూరు, అద్దంకి నియోజకవర్గాల్లోని ఆలయాల్లో అమ్మవారిని విశేష అలంకరణ చేశారు. శుక్రవారం అమ్మవారు వేదమాత గాయత్రీ దేవిగా దర్శనమిచ్చారు. ఆయా కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయాలను విద్యుత్తు దీపాలతో శోభాయమానంగా అలంకరించారు.



మార్టూరు: నాగరాజుపల్లిలో గాయత్రీ దేవిగా అమ్మవారు



ద్రోణాదులలో..



పర్చూరు కన్యకాపరమేశ్వరి ఆలయంలో..



జొన్నతాళిలో..



చినగంజాం శివాలయంలో..



వేటపాలెం లైబ్రరీ వీధిలో పూజల్లో మహిళలు



ముప్పవరంలో..




అద్దంకి: భువనేశ్వరీదేవిగా..



ఇంకొల్లులో..



అద్దంకిలో..



కారంచేడు: వైష్ణవి దుర్గామాత ఆలయంలో..

రుణాల కంతుల చెల్లింపుపై దృష్టి

బల్లికురవ(అద్దంకి): రుణాలు తీసుకున్న పొదుపు సంఘాల నుంచి కందుల వసూలుపై గ్రామైక్య సంఘాలు దృష్టి సారించాలని ఏపీఎం రాజారావు అన్నారు. మండల సమాఖ్య సమావేశం కె.రమాదేవి అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ఈసందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ పొదుపు మహిళలు తీసుకున్న సీఐఎఫ్, స్త్రీనిధి, ఉన్నతి వంటి రుణాల కంతులు క్రమం తప్పకుండా చెల్లించేలా పరిశీలన చేయాలన్నారు. మొండిబకాయిలుగా మిగిలి పోయిన సంఘాలకు తిరిగి రుణపరపతి పెరగపోగా దాని ప్రభావం మండలంలోని అన్ని సంఘాలపై పడుతుందని చెప్పారు.

అగ్నిప్రమాద బాధితుడికి ఆర్థిక సాయం

ఇంకొల్లు, న్యూస్‌టుడే: ఇంకొల్లు ముస్లిం కాలనీలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబానికి శాసన సభ్యుడు ఏలూరి సాంబశివరావు ఆర్థిక సాయం అందించారు. శుక్రవారం స్థానిక తెదేపా నాయకులు వలేరు మార్కు, నాయుడు హనుమంతరావు, సాంబయ్య, రామకృష్ణ, సుభాని, వెంకట్రావు, మస్తాన్‌బాబ, వలి తదితరులు ఏలూరి పంపిన రూ.25వేల ఆర్థిక సాయాన్ని బాధితుడు షేక్ బాబుకు అందజేశారు.

ప్రతిభకు ప్రోత్సాహం

ఇంకొల్లు, న్యూస్‌టుడే: విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దటానికి మద్దిరాలకు చెందిన సామ్రాజ్యం శేషాద్రి చారిటబుల్ ట్రస్ట్ ప్రోత్సాహకాలు అందజేస్తోంది. స్థానిక ఆదర్శ పాఠశాలలో పదోతరగతిలో అత్యధిక మార్కులు సాధించిన సొహైల్, కరీం, సంయుక్త, సుష్మ, అపర్ణసాహు, షబానా అనీషా, కౌసిక్, మారుతి, అభిజిత్ గీతా మాధురి, మేఘన, సౌమ్య, స్నేహితలకు రూ. వెయ్యి చొప్పున ట్రస్టు నిర్వాహకులు డాక్టర్ పుచ్చకాయల హరిబాబు శుక్రవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో అందజేశారు. కరస్పాండెంట్ విజయభాస్కర్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సత్తా చాటిన విద్యార్థులు

కొండమంజులూరు(జే పంగులూరు), న్యూస్‌టుడే : మండల, నియోజకవర్గ స్థాయిలో కొండమంజులూరు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. మండల స్థాయి పోటీల్లో 34 మంది, నియోజకవర్గ స్థాయి పోటీల్లో 16 మంది వివిధ రకాల ఆటల్లో ప్రతిభచూపారు. నియోజకవర్గ స్థాయిలో సంతమాగులూరు మండలం ఏల్చూరులో జరిగిన పోటీల్లో అండర్-17 బాలుర వాలీబాల్ జట్టులో అక్షిత్, సూర్యతేజ, సందీప్ స్థానం సాధించారు. అండర్-17 బాలికల విభాగంలో అవిలా, శ్రావణి, రమ్య, వైశాలి చోటు దక్కించుకున్నారు. కబడ్డీ బాలుర విభాగంలో రవికుమార్, లక్ష్మణ్‌కుమార్, బాలికల కబడ్డీలో కార్తీక, మణస్విని, ఖోఖోలో వై.సంధ్యారాణి స్థానం సంపాదించారు. అండర్-14 కబడ్డీ బాలికల్లో మానస, జ్యోత్స్న, చెస్‌లో జాకబ్, జపనీశాస్త్రి, జాన్‌బాబు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయిని ఐ.అనిత తెలిపారు.



జడ్పీ ఉన్నత పాఠశాల క్రీడాకారులు

క్రీడాకారులకు అభినందనలు..

చినగంజాం: అడవీధిపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన తొమ్మిది మంది క్రీడాకారులు జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీలకు ఎంపికయ్యారని పీడీ బి.లలిత తెలిపారు. యోగా అండర్-14 విభాగంలో నిహారిక, లావణ్య, బాలుర కబడ్డీ విభాగంలో ప్రమోద్, సుబ్బయ్య ఎంపికయ్యారు. అండర్-14 కబడ్డీ బాలికల విభాగంలో డి.యామిని, వి.యామిని, అండర్-17 ఆర్.దీపిక, వి.జోత్స్న, అండర్-14 కబడ్డీ బాలుర విభాగంలో కె.చంద్రశేఖరరెడ్డి ఎంపికయ్యారని పీడీ చెప్పారు.

మేదరమెట్ల, న్యూస్‌టుడే: కొరిశపాడు మండలం మేదరమెట్ల జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు జిల్లాస్థాయి ఆటల పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల నిర్వహించిన నియోజకవర్గస్థాయి పోటీల్లో వివిధ క్రీడాంశాల్లో సత్తాచాటారు. జిల్లాస్థాయి పోటీలకు ఎంపికైన వారిలో అండర్-17 200మీటర్ల పరుగు విభాగంలో ఎ.శ్రీను, అండర్-17 యోగా విభాగంలో ఎన్.అజయ్, టి.ప్రశాంత్, అండర్-14 విభాగంలో శరణ్య, ఫాతిమా, సిరి, సంతోష్, అండర్-14 ఖోఖో బి.రెబకా, కబడ్డీలో త్రిపుర, దీవెన అండర్-17 హ్యాండ్‌బాల్‌లో యశ్వంత్, హరిణీలు ఎంపికయ్యారు. వీరిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.అంజయ్య, పీఈటీ జ్వాలాలక్ష్మమ్మ అభినందించారు.

కస్తూర్బా గురుకులం విద్యార్థినుల ప్రతిభ

బల్లికురవ(అద్దంకి), న్యూస్‌టుడే : సంతమాగులూరు మండలం ఏల్చూరులో జరిగిన నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్, కొరిశపాడు మండలం మేదరమెట్లలో జరిగిన అథ్లెటిక్స్ పోటీల్లో విద్యార్థినులు ప్రతిభచూపారు. అథ్లెటిక్స్ లాంగ్ జంప్ ట్రిపుల్‌జంప్, హైజంప్, 1500 మీటర్ల పరుగులో బ్లెస్సీ, రాజేశ్వరి, నవీన, నాన్సీలు ప్రతిభ కనబరిచారు. ఆటల పోటీల్లో కబడ్డీ, ఖోఖో, యోగా, షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో రాజేశ్వరి, లక్ష్మీప్రసన్న, హేమలత, దీక్షిత, బుజ్జి, సంగీత, ప్రేమజ్యోతి జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఆమేరకు ప్రతిభ కనబరిచిన విద్యార్థినులను ప్రధానాచార్యురాలు సరళకుమారి, వ్యాయామ ఉపాధ్యాయులు అభినందించారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత

మార్టూరు: నియోజకవర్గంలోని వివిధ గ్రామాలకు చెందిన రోగులకు సీఎంఆర్‌ఎఫ్ నిధుల ద్వారా మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు లబ్ధిదారులకు అందజేశారు. ఆదిపూడికి చెందిన ప్రత్తిపాటి చైత్రకు తలసేమియా చికిత్స కోసం రూ.10 లక్షలు, ఇసుకదర్శికి చెందిన అంచా సుబ్బాయమ్మ మోకాళ్ల శస్త్రచికిత్స కోసం రూ.2.17 లక్షల చెక్కును ఏలూరి పంపిణీ చేశారు.

ఏలూరిని కలసిన బాపట్ల ఆర్డీవో గ్లోరియా

మార్టూరు: ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావును పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు, అభిమానులు శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఇసుకదర్శిలో కలిశారు. ప్రకాశం జడ్పీ ఉద్యోగులు మర్యాదపూర్వకంగా ఏలూరిని కలసి శాలువాతో సత్కరించారు. బాపట్ల ఆర్డీవో గ్లోరియా ఏలూరిని కలసి పుష్పగుచ్ఛం అందజేశారు.

ఘనంగా శ్రీవారి గ్రామోత్సవం

చినగంజాం, న్యూస్‌టుడే: చినగంజాం పురాతన శ్రీభూసమేత భావనారాయణస్వామి 17వ వార్షికోత్సవ రెండో రోజు పూజలు శుక్రవారం నిర్వహించారు. ఉదయం భక్తులు గరుడ పటాన్ని ఊరేగింపుగా తెచ్చి ధ్వజారోహణ పూజలు చేశారు. సాయంత్రం శేష వాహనంపై శ్రీవారికి గ్రామోత్సవం నిర్వహించారు.



గరుడ పటాన్ని ఊరేగింపుగా తెస్తున్న భక్తులు

వర్షాలు కురవాలని పూజలు

కడవకుదురు (చినగంజాం): వర్షాలు బాగా కురిసి... పంటలు బాగా పండాలని కోరుతూ కడవకుదురులోని రెడ్ల బజార్‌కు చెందిన మహిళలు గ్రామ దేవతలకు చీర, సారె, పసుపు, కుంకుమ, కొబ్బరి కాయలను నైవేద్యంగా సమర్పించి, శుక్రవారం పూజలు చేశారు. చీర, సారెను నెత్తిన పెట్టుకొని ఊరేగింపుగా వెళ్లి గ్రామానికి పడమరవైపు ఉన్న శ్రీపోలేరమ్మ, గంగమ్మ దేవతలకు సమర్పించారు. అనంతరం సహపంక్తి భోజనం ఏర్పాటు చేశారు.



సారెతో ఊరేగింపుగా వెళుతూ..

మైలవరం మహిళకు డాక్టరేట్



శిరీష

మైలవరం(అద్దంకి), న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతానికి చెందిన మహిళ జీవశాస్త్రంలో డాక్టరేట్ పొందారు. అద్దంకి మండలం మైలవరం గ్రామానికి చెందిన దివ్వెకోలు శిరీష జేఎన్‌టీయూ జీవశాస్త్ర విభాగంలో పీహెచ్‌డీ పొందేందుకు ఎనిమిదేళ్లు కష్టపడ్డారు. 2016లో తన పేరు నమోదు చేసుకోగా కొవిడ్ కారణంగా ఆలస్యమైంది. ఆమేరకు శుక్రవారం ఉదయం ఆమె పీహెచ్‌డీ సాధించినట్లు విశ్వవిద్యాలయం నుంచి సమాచారం అందింది. ఈమె ప్రస్తుతం హైదరాబాద్‌లోని హువెల్ లైఫ్‌సైన్సు పరిశోధనా విభాగంలో శాస్త్రవేత్తగా పనిచేస్తున్నారు. ఈమె భర్త ఖైరపునేని వెంకటసుబ్బారావు మైలాన్ ప్రయోగశాలలో పరిశోధనా విభాగంలో పనిచేస్తున్నారు.



కుంగిన రోడ్డుకి అడ్డుపెట్టారు... బాగుచేయరా?

చీరాల అర్బన్: నిత్యం రద్దీగా ఉండే ఏరియా వైద్యశాల రహదారిలో రోడ్డు అర అడుగు వరకు కుంగింది. ఈ ప్రాంతంలో ఎటువంటి ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు వీలుగా స్టాపర్లు ఏర్పాటు చేశారు. దీన్ని బాగుచేయరా అనే ప్రశ్నలు వాహనదారుల నుంచి వ్యక్తమవుతున్నాయి. ఈప్రాంతంలో వైద్యశాలలు ఎక్కువగా ఉండటంతో రోగులతో వచ్చే వారు వాహనాలు తీసుకురావడంతో వాటిని ఒక పక్క నిలుపుతున్నారు. ఇప్పుడు దెబ్బతిన్న రహదారి వద్ద స్టాపర్లు పెట్టడంతో ఎదురుగా ఏదైనా వాహనం వస్తే మరొకటి వెళ్లని స్థితి నెలకొంది. ఇకనైనా అధికారులు స్పందించి దీన్ని బాగుచేయాలని ప్రజలు కోరుతున్నారు.

నరేగా నిధులతో అభివృద్ధి పనులకు శ్రీకారం

చక్రాయపాలెం (అద్దంకి): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద అద్దంకి మండలంలోని వివిధ గ్రామాల్లో 42 పనులకు శ్రీకారం పలికారు. పంచాయతీరాజ్ ఏఈ వెంకటేశ్వర్లు అందించిన సమాచారం మేరకు చక్రాయపాలెంలో రూ.10 లక్షలతో సిమెంటు రోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం చేపట్టారు. చెరువుకొమ్ముపాలెం వద్ద ఇటీవల కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న కాజ్‌వే మరమ్మతులు పనులు రూ.20 లక్షలతో శనివారం నుంచి ప్రారంభిస్తామన్నారు. కొటికలపూడిలో-4, కుంకుబాడులో-3, మోదేపల్లిలో-3, కొంగపాడు-2, నాగులపాడు-2, శంఖవరప్పాడు-2, శింగరకొండపాలెం-1, కొత్తరెడ్డిపాలెం-1, తిమ్మాయపాలెం-2, వెంపరాల-3, గోవాడ-1, రామాయపాలెం-1, ఉప్పలపాడు-1, చిన్నకొత్తపల్లి-2, గోపాలపురం-1, కలవకూరు-1, మైలవరం-1, వేలమూరిపాడు-1, బొమ్మనంపాడు-2, ధర్మవరం-3 పనులు చేపట్టనున్నట్లు వివరించారు. ముంపు గ్రామాలైన ధేనువకొండ, మణికేశ్వరంలో ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టలేదని ఆయన చెప్పారు.



చక్రాయపాలెంలో చేపట్టిన సిమెంటు రోడ్డు నిర్మాణం